www.vishalabharati.com
epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
20.12.2023
సంపుటి:2 సంచిక:60

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక




## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌తో
# దేశానికే గుర్తింపు

- ఎంతో మంది ప్రముఖులను అందించిన ఘనత
- స్కూల్‌యాజమాన్యానికి అభినందనలు
- శతాబ్ది వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఎంతో మంది ప్రముఖులను అందించిందని, దేశానికి గొప్ప గుర్తింపు తెచ్చిపెట్టిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. అలాంటి పాఠశాల నేడు శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని రాష్ట్రపతి వ్యాఖ్యానించారు. మంగళవారం బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ శతాబ్ది వేడుకలకు ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెతో పాటు గవర్నర్ తమిళి సై సౌందర రాజన్, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి సీతక్క, పలువురు అధికారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ద్రౌపది ముర్ము జెండా ఊపి పబ్లిక్ స్కూల్ శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా వందేళ్ల చరిత్ర కలిగిన హెచ్‌పీస్ మ్యూజియంను ముర్ము సందర్శించారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము మాట్లాడుతూ ' హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఎంతో మంది ప్రముఖులను దేశానికి అందించింది. అలాగే ఈ పాఠశాల ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచి దేశానికి గొప్ప గుర్తింపును తెచ్చిపెట్టింది. విభిన్న నేపథ్యాల నుండి విద్యార్థులు కలిసి చదువుకోవడానికి, ఒకరి నుండి ఒకరు నేర్చుకోవడానికి ప్రోత్సహించే

..మిగతా 2 లో



# 'ప్రజావాణి'కి జనవాహిని

- ప్రజాభవన్‌కు భారీగా తరలివచ్చిన ఫిర్యాదుదారులు
- ధరణి, 'డబుల్ 'ఇండ్లు, పింంఛన్ గురించే ఎక్కువ వినతులు
- వినతులు స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- 5 వేలకు పైగా అర్జీలు వచ్చాయని మంత్రి వెల్లడి

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
తెలంగాణ కొత్త ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రజావాణి. ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలు చెప్పుకునేందుకు మంగళవారం ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అనేక జిల్లాల నుంచి ప్రజా భవన్‌కు వచ్చిన జనం.. తమ సమస్యలపై ప్రభుత్వానికి వినతులు సమర్పించారు. ప్రజావాణిలో తమ గోడు వెళ్లబోసుకునేందుకు వచ్చిన వారితో ప్రజాభవన్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు.

ఎక్కువ సమస్యలు వీటి గురించే..
ప్రజావాణిలో ధరణి సమస్యలు,

..మిగతా 2 లో



# కొనసాగుతున్న ఐపీఎస్‌ల బదిలీలు

- మరో 20 మందికి స్థానచలనం
- డీజీపీ రవి గుప్తాకు పూర్తి స్థాయి బాధ్యతలు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
తెలంగాణలో ఐపీఎస్ అధికారులు బదిలీలు కొనసాగుతున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం 20 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. మాజీ డీజీపీ అంజనీ కుమార్ కు ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయనను రోడ్డు భద్రత అథారిటీకి ఛైర్మన్ గా నియమించింది. రవి గుప్తాకు డీజీపీగా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి మంగళవారం సాయంత్రం ఆదేశాలు ఇచ్చారు. రాజీవ్ రతన్ ను రాష్ట్ర విజిలెన్స్, ఎన్ ఫోర్స్మెంట్ డీజీగా బదిలీ చేసింది. సీవీ ఆనంద్ ను ఏసీబీ డైరెక్టర్ జనరల్ నియమించింది. అభిలాష బిస్త్ ను తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ బదిలీ చేసింది. సౌమ్య మిశ్రాను జైళ్ల శాఖ డీజీగా బదిలీ చేసింది. శిఖా గోయల్ ను సీఐడీ అడిషనల్ డీజీగా నియమించింది.

**అంజనీ కుమార్ కు పోస్టింగ్**
మాజీ డీజీపీ అంజనీ కుమార్ కు రోడ్డు భద్రతా విభాగం ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించింది. దీంతో పాటు ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఐడీ డీఐజీగా రమేష్ నాయుడు నియమితులయ్యారు. సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ జాయింట్ కమిషనర్‌గా సత్యనారాయణ, ఆబ్కారీ శాఖ డైరెక్టర్‌గా కమలాసన్‌రెడ్డి, టీసీపీఎఫ్ అదనపు డీజీగా అనిల్ కుమార్, హోంగార్డ్స్ ఐజీగా స్టీఫెన్ రవీంద్ర, హైదరాబాద్ మల్టీ జోన్ ఐజీ2గా తరుణ్ జోషి, హైదరాబాద్ మల్టీ జోన్1 ఐజీగా జోషికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఏసీబీ డైరెక్టర్‌గా ఏఆర్ శ్రీనివాస్, ఐజీ పర్సనల్‌గా చంద్రశేఖర్‌రెడ్డి, సీఐడీ అదనపు డీజీగా శిఖా గోయల్ బదిలీ

..మిగతా 2 లో



## ప్రభుత్వంతో జూడాల
# చర్చలు సఫలం..

- స్టైఫండ్‌కోసం గ్రీన్‌చానల్ ఏర్పాటు
- ప్రతి నెలా 15 లోగా రిలీజ్‌చేస్తాం
- హెల్త్‌మినిస్టర్ దామోదర్ రాజనర్సింహ్మాహామీ
- వెనక్కి తగ్గిన జూనియర్ డాక్టర్లు
- త్వరలో స్పష్టమైన ప్రకటన చేస్తామని వెల్లడి

..మిగతా 2 లో

# అస్సలు తగ్గొద్దు

- అసెంబ్లీలో హోరెత్తించాలని కేటీఆర్, హరీశ్ రావుకు కేసీఆర్ సూచన
- కేసీఆర్ తో కీలక భేటీ .. అధికార పక్షాన్ని ఇరుకున పెట్టాలని సూచన

..మిగతా 2 లో

## ఢిల్లీలో సీఎం రేవంత్
# ఫుల్‌బిజీ



- కాంగ్రెస్‌అగ్రనేతలు ఖర్గే, సోనియా, రాహుల్‌తో భేటీ
- ముగ్గురికీ కాంగ్రెస్ పీఏసీ తీర్మానం కాపీ అందజేత..
- తొలిసారి సీఎం అధికారిక నివాసానికి వెళ్లిన రేవంత్‌రెడ్డి
- తెలంగాణ భవన్‌నిర్మాణంపై అధికారులతో రివ్యూ

**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన బిజీ బిజీగా సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లిన బయలుదేరిన సీఎం.. పార్టీ అగ్రనేతలతో వరుసగా భేటీ అవుతున్నారు. ముందుగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలు, నామినేటెడ్ పదవుల భర్తీ, మంత్రివర్గ విస్తరణపై వీరు చర్చించుకున్నట్లు సమాచారం. అనంతరం ఏఐసీసీ అగ్రనేతలు సోనియా, రాహుల్, ఖర్గేలతో రేవంత్ భేటీ అయ్యారు. ఆ తర్వాత ఢిల్లీలోని సీఎం అధికార నివాసాన్ని పరిశీలించారు. తుగ్లక్ రోడ్ నెంబర్ 23లో ఉన్న అధికారిక నివాసానికి రేవంత్ రెడ్డి వెళ్లారు. ఆయన అధికారిక నివాసానికి వెళ్లడం ఇదే తొలిసారి. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధికారిక నివాసం నుంచి ఖాళీ చేయడంతో మంగళవారం రేవంత్ రెడ్డి సందర్శించారు.**

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

**పీఏసీ తీర్మాన కాపీ ఖర్గేకు అందజేత..**
వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి సోనియా గాంధీని పోటీ చేయాలని స్వయంగా సీఎం రేవంత్ కోరినట్లు తెలుస్తోంది. ఈ మేరకు సోమవారం రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చేసిన తీర్మానం కాపీని మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీలకు సీఎం రేవంత్ అందించారు.

**తెలంగాణ భవన్ నిర్మాణంపై సీఎం సమీక్ష**
తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా దేశ రాజధాని న్యూ ఢిల్లీలో కొత్త తెలంగాణ భవన్ నిర్మిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. న్యూ ఢిల్లీలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ భవన్.. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఉమ్మడి ఆస్తుల విభజనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. న్యూ ఢిల్లీలోని తన నివాసంలో ఈ అంశంపై తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, భవన్ ఓఎస్డీ సంజయ్ జాజుతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు.
భవన్ మొత్తం విస్తీర్ణం ఎంత? అందులో ఉన్న భవనాలు, వాటి స్థితి, అందులో తెలంగాణ వాటా వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడిగా 19.781 ఎకరాల భూమి ఉందని అధికారులు తెలిపారు. ఇందులో ఉమ్మడి భవన్ పరిధిలోని 8.781 ఎకరాల్లో శబరి బ్లాక్, అంతర్గత రోడ్లు, గోదావరి బ్లాక్, 3.359 ఎకరాల్లో ఓల్డ్ నర్సింగ్ హాస్టల్, 7.641 ఎకరాల్లో పటౌడి హౌస్ ఉన్నాయని అధికారులు తెలిపారు. తెలంగాణ వాటా కింద ఎంత భూమి వస్తుందని సీఎం ప్రశ్నించారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం మన రాష్ట్రం తెలంగాణకు 8.245 ఎకరాల భూమి వస్తుందని, ఏపీకి 11.536 ఎకరాలు (41.68:58.32 నిష్పత్తిలో) వెళుతుందని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు.
ప్రస్తుత భవనాల స్థితి, అధికారులు, సిబ్బంది నివాస గృహాల స్థితిపై సీఎం ఆరా తీశారు. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించినవి కావడంతో చాలా వరకు శిథిలావస్థకు చేరాయని, మరమ్మతులు చేయిస్తున్నామని రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా నూతన భవనం నిర్మించుకుందామని సీఎం అన్నారు. అంతకుముందు రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తుల విభజనపై దృష్టి సారించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం భవన్ మ్యాప్ ను పరిశీలించారు. ఆస్తుల విభజనపై అధికారులకు పలుసూచనలు ఇచ్చారు.

# కేటీఆర్ వర్సెస్ సిద్ధరామయ్య





- ట్విట్టర్ వార్
- సిద్ధరామయ్య మాట్లాడిన వీడియో పోస్ట్ చేసిన కేటీఆర్
- ఫేక్ వీడియో అంటూ సిద్ధరామయ్య కౌంటర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
కాంగ్రెస్ ఇచ్చిన అన్నీ గ్యారెంటీలు అమలు సాధ్యం కాదని కర్నాటక అసెంబ్లీ ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య అన్నట్టు సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అవుతోంది. సిద్ధరామయ్య మాట్లాడిన ఆ వీడియోను ట్విట్టర్‌లో పోస్టు చేసి... తెలంగాణ భవిష్యత్ కూడా ఇంతేనా అంటూ ప్రశ్నించారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్. హామీలు ఇచ్చే ముందు ఆలోచించరా అంటూ నిలదీశారు. ఇంతకీ సిద్ధరామయ్య ఏమన్నారంటే... ఎన్నికల్లో ఓట్ల కోసం ఎన్నో హామీలు ఇస్తాం... అన్నీ అమలు చేయాలంటే డబ్బు ఎక్కడ నుంచి వస్తుంది. ఎన్నికల ప్రచారంలో వాగ్ధానం చేసింది నిజమే.. అంత మాత్రాన ఫ్రీగా ఇవ్వాలా...? అన్ని వాగ్దానాలు అమలు చేయలేమని కర్నాటక సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీలో అన్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వీడియోపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య స్పందించారు. కేటీఆర్ ఫేక్ వీడియోను పోస్ట్ చేశారని ఆరోపించారు. తప్పుడు ప్రచారాలు నమ్మడం వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందని.. ఆ పార్టీ ఇంకా మారలేదని సిద్ధరామయ్య ఫైర్ అయ్యారు.
ఉత్తరాంధ్ర నౌ అనే సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్టు చేసిన ఆ వీడియోను కేటీఆర్ రీట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి కొన్ని ప్రశలు సంధించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడానికి డబ్బులు లేవని సిద్ధరామయ్య అంటున్నారని... హామీలు ఇచ్చే ముందు ఫైనాన్షియల్ కండిషన్ గురించి ఆలోచన చేయరా అని నిలదీశారు. కర్నాటకలో మాదిరిగానే తెలంగాణ భవిష్యత్ కూడా ఉంటుందా అని కేటీఆర్ ప్రశ్నించారు.



..మిగతా 2 లో

# ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తాం

- రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- పవర్‌పాయింట్‌ప్రజంటేషన్‌ఇస్తారా?
- బీఆర్ఎస్‌సభ్యులకు కామన్‌సెన్స్‌ఉందా?
- కేంద్రం నియంతృత్వ పోకడలు ఆపాలి
- బీఆర్ఎస్, బీజేపీపై మంత్రి సీరియస్

# కొనసాగుతున్న ఐపీఎస్‌ల బదిలీలు

**మొదటిపేజీ తరువాయి**

అయ్యారు. శిఖా గోయల్‌కు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

**ఇంటెలిజెన్స్ డీఐజీగా సుమతి**

రైల్వేస్ అండ్ రోడ్డు సేఫ్టీ అడిషనల్ డీజీపీగా మహేష్ భగవత్ బదిలీ అయ్యారు. ఎస్పీఎఫ్ డీజీగా అనిల్ కుమార్, ఎక్సైజ్ డైరెక్టర్‌గా కమలసన్‌రెడ్డి, ఏసీబీ డైరెక్టర్‌గా ఏఆర్. శ్రీనివాస్ హైదరాబాద్ రేంజ్ ఐజీగా చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా ఎం. రమేష్, కార్ హెడ్ క్వార్టర్స్ జాయింట్ సీపీగా సత్యనారాయణ బదిలీ అయ్యారు. ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్ డీఐజీగా సుమతి, సెంట్రల్ జోన్ డీసీపీగా శరత్‌చంద్ర పవర్ బదిలీ అయ్యారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌తో దేశానికే గుర్తింపు

**మొదటిపేజీ తరువాయి**

వాతావరణాన్ని సృష్టించినందుకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందిస్తున్నాను. భవిష్యత్‌లో ఈ పాఠశాల మరిన్ని శిఖరాలు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని తెలిపారు.

అనంతరం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ.. 'రాష్ట్ర, దేశాభివృద్ధికి పాటుపడిన ఎంతో మంది ప్రముఖులను ఈ పాఠశాల తయారు చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, బ్యాంకింగ్ దిగ్గజాలు, సీఏలు, న్యాయవాదులు.. ఇలా పలు రంగాలకు చెందిన ప్రముఖులు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. క్రీడలు, విద్యా కార్యకలాపాలు విద్యాసంస్థలకు రెండు కళ్ళు కాబట్టి విద్యార్థులు చదువుపైనే కాకుండా క్రీడలపై కూడా దృష్టి సారించాలి' అని పేర్కొన్నారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా స్కూల్ యాజమాన్యానికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

**నేడు భూదాన్‌పోచంపల్లికి రాష్ట్రపతి..**

మగువలు మెచ్చే పట్టుచీరలకు నిలయం.. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి పట్టు చీరలకు యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి కేరాఫ్ అడ్రస్. పోచంపల్లి చేనేత కార్మికుల నైపుణ్యానికి ప్రతీక. ఇక్కడి కంచి పట్టుచీరలు, చేనేత కార్మికుల సృజనాత్మకత, నూతన డిజైన్లతో చేనేత వస్త్రాల తయారీతో పర్యాటక ప్రాంతంగా మారింది. ఇక్కడ జరిగే సదస్సులో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్నారు. రాష్ట్రపతి పర్యటన కోసం జిల్లా అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇప్పటికే హైదరాబాద్‌కు చేరుకున్నారు. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేడు యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లిలో జరిగే థీమ్ పెవిలియన్ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొంటారు. ఇక్కడ చేనేత వస్త్ర కళానైపుణ్యాన్ని స్వయంగా తిలకించనున్నారు. పోచంపల్లిలోని చేనేత గృహాలను సందర్శించి కార్మికుల ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకోనున్నారు. అనంతరం సంత్ కబీర్, పద్మశ్రీ జాతీయ అవార్డులు పొందిన వారు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 16 మంది ఉన్నారని, ఇందులో ఎంపిక చేసిన పది మంది చేనేత కళాకారులు రాష్ట్రపతితో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు.

# 'ప్రజావాణి'కి జనవాహిని

**మొదటిపేజీ తరువాయి**

పెన్షన్, డబుల్ బెడ్ రూం సమస్యలపైనే ప్రజల నుంచి ఎక్కువగా విజ్ఞప్తులు వస్తున్నాయి. గత ప్రభుత్వం తమ ఇబ్బందులను పట్టించుకోలేదని.. ఈ ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తాము అర్హులమైనా పెన్షన్, డబుల్ బెడ్ రూం ఇవ్వడం లేదని ప్రజలు మొరబెట్టుకుంటున్నారు. మంగళవారం ప్రజావాణిలో మొత్తం 5 వేలకు పైగా ప్రజల నుంచి వినతులు వచ్చాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అయితే ప్రభుత్వం పాలసీపరంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని.. వాటి ద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. త్వరలోనే కీలక అంశాలపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. అప్పటివరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ప్రజలు వేచి ఉండాలని కోరారు.

# ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తాం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

ఆటో డ్రైవర్లకు ఖచ్చితంగా న్యాయం చేస్తామని.. అప్పటి వరకు కొంచెం ఓపిక పట్టాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ప్రజా భవన్ లో ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన మంత్రి అర్జీదారుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. వారి సమస్యలు సావధానంగా విన్నారు. అనతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమం చాలా బాగా జరుగుతుందని చెప్పారు. కాగా.. తెలంగాణ స్టేట్ ఆటో అండ్ ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్, బీఎంఎస్ అనుబంధ టీఎస్‌పీటీఎంఎం ఆధ్వర్యంలో పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణాలపై పునరాలోచన, బస్సుల సంఖ్య తగ్గించడం, ఓలా, ఉబర్, ర్యాపిడ్ బైక్‌ల అక్రమ వ్యాపారాన్ని నిషేధించడం వంటి డిమాండ్లను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. త్వరలో ఆటో యూనియన్లతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మంగళవారం 5,126 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటిలో చాలా మంది సొంత ఇల్లు లేదని వచ్చారని అన్నారు. నిరుద్యోగులు కూడా ఎక్కువ సంఖ్యలో వచ్చారని, వాళ్ల సమస్యలు కచ్చితంగా పరిష్కారం చేస్తామని స్పష్టం చేశారు. ఇక తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల ఆటో వాళ్ళు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆ విషయం మా దృష్టికి వచ్చిందని అన్నారు. ఆటో వాళ్లు మా సోదరులే .. వాళ్లకు తప్పకుండా న్యాయం చేస్తామని తెలిపారు. ఆటో వారి విషయంలో ప్రభుత్వం విధాన పరమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు కొంచెం ఓపికగా ఉండాలని సూచించారు. అందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వ ఆలోచన ఉంటుందని అన్నారు. ఎవరూ నిరాశపడొద్దని త్వరలోనే మీ సమస్యలకు పరిష్కారం మార్గం చూపుతామని పొన్నం తెలిపారు.

**బీఆర్ఎస్‌సభ్యులకు కామన్‌సెన్స్‌ఉండాలి**

అనంతరం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రేపు సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు తమకు అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ కోరడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్ అయ్యారు. గతంలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై కేసీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంలో తమకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ కోరితే ఛాన్స్ ఇచ్చారా? ఇప్పుడు వచ్చి తమకు అవకాశం కల్పించాలని అడగడానికి కామన్సెన్స్ ఉండాలి కదా అని ఘాటుగా రియాక్ట్ అయ్యారు. ఆనాడు కేసీఆర్ ప్రజెంటేషన్ సందర్భంగా ప్రతిపక్షాలకు అవకాశం ఇచ్చి ఉంటే ఇవాళ కాళేశ్వరం ప్రాజెక్టుల్లో కుంగిపోయిన ఘటనలు ఉండేవి కాదన్నారు. రేపు తమ ప్రభుత్వం చెప్పబోయేది గొప్పలు కాదని రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అసెంబ్లీ వేదికగా ప్రజలకు వివరించబోతున్నామన్నారు.

దీంట్లో రాజకీయం ఏమి లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతా బాగానే ఉంటే భుజాలెందుకు తడుముకుంటున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమల్లో ఉన్నారని, ప్రభుత్వం మారిందని గ్రహించాలన్నారు. మేమిచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని ఇంతలోనే బీఆర్ఎస్ నేతలు ఆత్రపడుతున్నారని దుయ్యబట్టారు. ఇన్నాళ్లు బీఆర్ఎస్ నాయకులు చెప్పినట్లుగా వారిది గొప్ప పరిపాలనే అయితే ప్రజావాణికి వేలాది దరఖాస్తులు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ఆటో కార్మికులకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదన్నారు.

**కేంద్రం నియంతృత్వం పోకడ ఆపాలి**

పార్లమెంట్ భద్రతపై ప్రశ్నిస్తే కేంద్రం ప్రతిపక్ష సభ్యులను సస్పెన్షన్ చేస్తోందని కేంద్ర ప్రభుత్వం నియంతృత్వంతో వ్యవహరిస్తోందని మంత్రి పొన్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ సిఫార్సు వల్ల నిందితులకు పాస్‌లు వచ్చాయని నిందితులను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ఘటన జరిగి వారం రోజులైనా దోషులపై చర్యలు లేవని, పార్లమెంట్ భద్రత అంశంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

# అమెరికాలో తెలుగు సభలకు రండి

## డిప్యూటీ సీఎం 'భట్టి'ని కలిసిన ఎన్ఆర్ఐ ప్రతినిధులు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఎన్ఆర్ఐ ప్రతినిధులు కలిశారు. మే 24 నుంచి 26 వరకు అమెరికాలో జరిగే తెలంగాణ అమెరికా తెలుగు సంఘం మహాసభలకు రావాలని ఇన్విటేషన్ ఇచ్చారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో ఎన్ఆర్ఐ సంఘం అధ్యక్షులు వంశీ రెడ్డి, ప్రతినిధులు మలిపెద్ది నవీన్, కవితా రెడ్డి, సురేష్ రెడ్డి, గణేష్, జ్యోతిరెడ్డి, మనోజ్ రెడ్డి, దుర్గాప్రసాద్, మనోహర్ తదితరులు ఉన్నారు. మరోవైపు.. ఈ నెల 23న రవీంద్రభారతిలో జరిగే సేవా డేస్ కార్యక్రమానికి రావాలని ఆహ్వానము అందించారు. డిసెంబర్ 10 నుంచి ఈనెల 23 వరకు రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల గురించి వారు డిప్యూటీ సీఎంకు వివరించారు. వరంగల్ లో 38 కంపెనీల సహకారంతో జాబ్ మేళా నిర్వహించగా.. 16,000 మంది హాజరయ్యారని, అందులో 1500 మంది నిరుద్యోగులను ఎంపిక చేసామని చెప్పారు.

# ఆపదలో అండగా.. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్

## అన్ని వర్గాల ప్రజలకు చేయూత..



### పేద విద్యార్థుల పెద్ద చదువులకు ఆర్థిక చేయూత

### విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విస్తృతంగా సేవలు

### రాష్ట్ర వ్యాప్తంగా జాబ్‌మేళాలతో యువతకు ఉద్యోగాలు

### నేడు ప్రతీక్‌రెడ్డి 13 వ వర్ధంతి సందర్భంగా స్వచ్ఛంద కార్యక్రమాలు


**ఎవరైనా సరే ఆపదలో ఉన్నామంటే చాలు వెంటనే స్పందిస్తోంది కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్. అనారోగ్యానికి గురై వైద్యం చేయించుకోలేని దుస్థితిలో ఉన్నట్లు తెలిస్తే వారికి తమవంతు సాయమందిస్తోంది. ఎంతోమంది పేద విద్యార్థులకు చదువులను ఉచితంగా చదివిస్తూ... ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటోంది. పన్నెండేండ్లుగా నిత్యం ఏదో ఒక సామాజిక కార్యక్రమం చేస్తూ అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తూ, అందరి మన్ననలు పొందుతోంది. ఆపన్నులకు అండగా నిలుస్తూ ఆప్తులుగా సేవలందిసున్న ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కుమారుడు 'ప్రతీక్ రెడ్డి 13 వ వర్ధంతి' సందర్భంగా.. ఫౌండేషన్‌చేస్తున్న కృషిపై స్పెషల్‌స్టోరీ..**

**– విశాల భారతి, స్టేట్‌బ్యూరో**

ఎక్కడ ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా.. ఆదుకునేందుకు ఫోన్‌కాల్ దూరంలో ఉంటారు.. ఈ మెమోరియల్‌నిర్వాహకులు. అన్నా అంటే.. నేనున్నా.. అనే నైజం గల ప్రజానాయకుడి కడుపున పుట్టిన ప్రతీక్‌రెడ్డి దురదృష్టవశాత్తు 2011లో యాక్సిడెంట్‌లో చనిపోయారు. చిన్న వయసులోనే ఎంతో సేవాగుణం కలిగిన తన కుమారుడి ఆశయాల సాధనకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆయన పేరుమీద 'కోమటిరెడ్డి ప్రతీక్‌మెమోరియల్‌ట్రస్ట్, ఫౌండేషన్' ఏర్పాటు చేశారు. నాటి నుంచి అన్ని రంగాల్లో పేదలకు, విద్యార్థులకు, యువకులకు, రైతులకు రాష్ట్ర వ్యాప్తంగా సేవలందిస్తూ.. ముందుకు సాగుతున్నారు.

**ఏటా జిల్లా వ్యాప్తంగా రక్తదానం**

కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏటా భారీ ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ ఫౌండేషన్‌కు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చైర్మన్ కాగా, గోనారెడ్డి సీఈవోగా వ్యవహరిస్తున్నారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా.. ఎప్పటికప్పుడు ఫౌండేషన్‌ను నిలబెడుతూ ప్రజలకు సేవ చేస్తున్నారు. రక్తం అందక చనిపోయేవారి ప్రాణాలు నిలబెట్టుతున్నారు. అదే విధంగా ఉద్యోగాల కోసం ప్రిపేర్‌అయ్యే వారికి కాంపిటేటివ్‌బుక్స్‌పంపిణీ చేస్తారు. ఆయా స్కూల్స్‌కాలేజీలలో బాగా చదివి పేదరికంతో ఇబ్బంది పడే స్టూడెంట్లను గుర్తించి వారికి ఆర్థిక చేయూతను అందిస్తారు. అలా అందించిన వారు ఎంతో మంది ఉన్నారు. అలా అందించిన వారిలో.. "నల్గొండ జిల్లా పెద్దబండ మండలం గొల్లగూడా గ్రామానికి చెందిన బోడ అమృత వర్శిని అనే విద్యార్థిని ఒక పేద కుటుంబంలో జన్మించింది. తండ్రి ఆటో డ్రైవర్, తల్లి టైలర్ కావడం వల్ల వచ్చిన సంపాదన కుటుంబ పోషణకు మాత్రమే సరిపోయేది. అలాంటి



పరిస్థితుల్లోనే అమృత వర్శిని తన చదువును కొనసాగిస్తోంది. పైలెట్ కావాలనే ధ్యేయం తో కష్టపడి చదివి పైలెట్ గా సెలక్ట్ అయ్యింది. ట్రైనింగ్ దశలో ఉన్న వర్శినికి తన చదువు పూర్తి చేయాలంటే రూ.6 లక్షలు కావాలి. వారి కుటుంబ నేపథ్యంలో డబ్బులు కట్టడం కష్టంగా మారింది. దిక్కుతోచని స్థితిలో వర్శినికి కోమటిరెడ్డి వెంకన్న గుర్తుకు వచ్చి, తన పరిస్థితి తన లక్ష్యాన్ని వాట్సాప్ మెసేజ్ ద్వారా ఆయనకు తెలియజేసింది. వెంటనే స్పందించి.. విద్యార్థినినీ తన ఇంటికి పిలిపించుకుని రూ.2 లక్షలు ఇచ్చి తన చదువుకు అయ్యే పూర్తి ఖర్చు తనే ఇస్తాను అని హామీ ఇచ్చారు.'' ఇలా ఎన్నో కార్యక్రమాలు కోమటి రెడ్డి ప్రతీక్‌ఫౌండేషన్‌చేపడుతోంది.

**నేడు మెగా రక్తదాన శిబిరం**

**నల్గొండలోని ప్రతీక్‌మెమోరియల్ కాలేజీలో ప్రతీక్‌రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా నేడు మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ప్రతీక్‌ఫౌండేషన్ సీఈవో గోనారెడ్డి మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమానికి మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. నల్గొండ పట్టణంలో పేద విద్యార్థులకు, నిరుద్యోగులకు బుక్స్‌పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లో ఫౌండేషన్‌మెంబర్లు, కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.**

**– గోనారెడ్డి, సీఈవో, కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్**

దేశ్‌పాండే అనే ఫౌండేషన్‌ద్వారా.. రైతులకు చేయూత నిస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని వెనుక బడిన ప్రాంతాల్లో రైతులకు ఉచితంగా ఫామ్‌పాండ్‌లు తవ్వించి వారికి సాగునీటిని అందించింది. వారి పంటలను కొనుగోలు చేస్తూ.. దళారుల చేతిలో రైతులు మోసపోకుండా కాపాడుతోంది.










# 'కాళేశ్వరం'పై విచారణ వాయిదా



రెండు వారాలు వాయిదా వేసిన హైకోర్టు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

కాళేశ్వరం ప్రాజెక్టు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు రెండు వారాలకు విచారణ వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని పిటిషన్ దాఖలైంది. టీపీసీసీ ఎలక్షన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ నిరంజన్ ఈ పిటిషన్ వేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపురం పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన కేసును సీబీఐకి బదిలీ చేయాలని పిటీషన్‌లో కోరారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన అంశంపై పిటిషనర్ పలు అనుమానాలు వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ కుంగిన ఘటన జరిగిన సమయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీకి పలు ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదులను అనుసరించి రాష్ట్ర సీఎస్‌కు లేఖ రాసిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటి. సీఎస్ నుండి సమాచారం తీసుకుని రెండు వారాల్లోపు పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసిన హైకోర్టు వెల్లడించింది.

**కాళేశ్వరం ప్రాజెక్ట్ దోషులను ఉరి తీయాలి**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్ ఆలోచించి మాట్లాడాలని తెలిపారు. కేంద్రాన్ని మెడలు వంచి తెలంగాణ తెచ్చినం అని చెప్పి, తెలంగాణ హక్కులను భంగం కలిగించే విధంగా 7 మండలాలను ఆంధ్రాలో కలిపారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ త్యాగంతో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. ఇదిలా ఉంటే.. ఫ్రీ బస్ సౌకర్యం వలన ఆటో కార్మికులకు కొంత ఇబ్బంది కలుగుతుంది.. సీఎం వారి కోసం తీవ్రంగా ఆలోచన చేస్తున్నారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ దోషులను ఉరి తీయాలని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. లీడర్లు డిజైన్ చేస్తే ఇట్లనే ఉంటదని విమర్శలు గుప్పించారు. సీఎం వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మిల్లర్లు కటింగ్ పేరుతో రైతులను దోచుకున్నారని తెలిపారు. ధర్మకాంట రశీదు ఇచ్చి తరుగు తాలు లేకుండా చేయాలని అన్నారు. అంతేకాకుండా.. ఇసుక మాఫియా అరికట్టాలని కలెక్టర్ కి లేఖ ఇచ్చామని లక్ష్మణ్ పేర్కొన్నారు. కాగా.. 28న గ్రామ సభల్ని ఏర్పాటు చేస్తున్నాం.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజలకు అందజేస్తామని ఆయన తెలిపారు.

# న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు

**విశాలభారతి, హైదరాబాద్ :** న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు విధిస్తున్నట్లు హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కొత్త సంవత్సరం వేడుకలను డిసెంబర్ 31న రాత్రి ఒంటి గంట లోపు ముగించాలి. పబ్‌లు, రెస్టారెంట్లతో పాటు ఈవెంట్ నిర్వాహకులు 10 రోజుల ముందే అనుమతి తీసుకోవాలి. ప్రతీ ఈవెంట్‌లో సీసీ కెమెరాలు, సెక్యూరిటీని తప్పక ఏర్పాటు చేయాలి. 45 డెసిబెల్స్‌కు మించి ఎక్కువ శబ్దం ఉండొద్దని పోలీసులు ఆంక్షలు విధించారు. ఈవెంట్ సామర్థ్యానికి మించి పాసులు ఇవ్వొద్దని ఆదేశించారు. న్యూఇయర్ వేడుకల్లో డ్రగ్స్, గంజాయి వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా లిక్కర్ సరఫరా చేయకూడదన్నారు. పబ్స్‌లో అశ్లీల నృత్యాలు నిషేధం అని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపరాదు. ఒక వేళ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ. 10 వేలు జరిమానా, ఆర్నెళ్లు జైలు శిక్ష విధిస్తామన్నారు.

# ప్రభుత్వంతో జూడాల చర్చలు సఫలం..

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో సమ్మెబాట పట్టిన జూనియర్ డాక్టర్ల ను చర్చలకు ఆహ్వానించారు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సమస్యల పైన వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్టైఫండ్ ను రెగ్యులర్ గా వచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరిన జూనియర్ డాక్టర్ల వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. స్టైఫండ్‌కోసం గ్రీన్‌చానల్ ఏర్పాటు చేస్తామని, ప్రతి నెల 15 వ తేదీ వరకు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ చర్చల్లో మరో కీలక విషయం పై స్పందించారు మంత్రి దామోదర రాజనర్సింహ

తమ సమస్యల పరిష్కారానికి మంగళవారం నుంచి విధులకు హాజరు కావడం లేదని సమ్మె నోటీసు ఇచ్చారు జూనియర్ డాక్టర్లు. వైద్యులకు రావలసిన స్టైఫండ్ మూడు నెలలుగా రావడం లేదని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని సమ్మెకు పిలుపునిచ్చారు జూనియర్ డాక్టర్లు. గత రెండు మూడు నెలల నుంచి తమకు రావాల్సిన స్టైఫండ్ సరిగా అందడం లేదని స్ట్రైక్ నోటీస్ ఇచ్చారు వైద్యులు. దీనికి సంబంధించిన నోటీస్ డీఎంఈకి అందించి మంగళవారం నుంచి విధులకు హాజరు కావడం లేదని నోటీస్ ఇచ్చారు. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 8వేల మంది జూనియర్ డాక్టర్స్ సీనియర్ ప్రెసిడెంట్ డాక్టర్స్ సర్జన్స్ ఇలా వివిధ డిపార్ట్మెంట్లలో పనిచేస్తున్న వైద్యులు విధులు బహిష్కరించాలని సమ్మెకు పిలుపు నిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఇంటెన్సివ్ చేస్తున్న హౌస్ సర్జన్లు దాదాపు 2500 మంది, పీజీలో స్పెషాలిటీ చేస్తున్నటువంటి 4000 మంది జూనియర్ డాక్టర్స్ , మరొక 2000మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ 1500 మంది సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యార్థులు ఇలా దాదాపుగా వివిధ డిపార్ట్ మెంట్లలో 8వేల మంది వరకు వైద్య విద్యార్థులకు సరైన స్టైఫండ్ అందడం లేదని ఈ కారణం చేత ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని వైద్య విద్యార్థులు సమ్మె బట్ట పట్టారు. రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులాగా తమకు స్టఫ్ అండ్ రెగ్యులర్ గా అందే విధంగా రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# అస్సలు తగ్గొద్దు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, విద్యుత్, నీటిపారుదల తదితర రంగాలపై అసెంబ్లీ వేదికగా శ్వేతపత్రాలు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతుందనే వార్తల నేపథ్యంలో భారత్ రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ పార్టీ కీలక నేతలకు దిశా నిర్దేశం చేశారు. తుంటి ఎముక శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న కేసీఆర్‌తో బంజారాహిల్స్ నందినగర్ నివాసంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పార్టీ ముఖ్య నేతలు కొందరు సోమవారం సాయంత్రం భేటీ అయ్యారు.

**అధికార పక్షాన్ని ఇరుకున పెట్టాలి**

'అర్ధసత్యాలు, అసత్యాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు, రాబోయే రోజుల్లో ఎదురయ్యే వైఫల్యాలకు బీఆర్ఎస్‌ను బాధ్యులను చేసేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు సీఎం ఇచ్చిన సమాధానం అదే తరహాలో ఉంది. కాబట్టి సభ వేదికగానే అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేందుకు అన్ని రంగాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో వెళ్లండి. ఎన్ని గంటలైనా చర్చకు సిద్ధంగా ఉంటూ సమన్వయంతో ముందుకు వెళ్లండి. రంగాల వారీగా మనం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేందుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి..'అని కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు.

**అసెంబ్లీ భేటీ తర్వాత లోక్‌సభపై దృష్టి**

అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే లోక్‌సభ ఎన్నికలపై దృష్టి పెట్టాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కేసీఆర్ సూచించారు. ఇప్పటికే లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు సాధించిన ఓట్లు, ఇతర పార్టీల పరిస్థితిపై నివేదికలు రూపొందించిన నేపథ్యంలో.. నియోజకవర్గాల వారీగా సమీక్ష, సన్నాహక సమావేశాలు నిర్వహించేందుకు షెడ్యూల్‌ను రూపొందించాలని ఆదేశించారు.గెలుపోటములతో సంబంధం లేకుండా తాజా, మాజీ ఎమ్మెల్యేలు అందరూ క్షేత్ర స్థాయిలో కేడర్‌తో సమావేశమయ్యేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. త్వరలోనే తెలంగాణ భవన్‌లో కార్యవర్గం, ప్రజా ప్రతినిధులతో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనుంది.



## క్రీడాకారునికి ఆర్థిక సహాయం

**మణుగూరు, విశాల భారతి:** మండలంలోని కూనవరం గ్రామానికి చెందిన పాటి నాగరాజు కుమారుడు పాటి సిద్ధివిగ్నేశ్వర్ జూనియర్ నేషనల్ ఫుట్ బాల్ ఎస్ .జీ .ఎఫ్ క్రీడకు మణుగూరు నుండి ఎంపికైనందున తన ఆర్థిక స్థోమత బాలేదని తెలుసుకొని పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మంగళవారం ఎమ్మార్వో ఆఫీస్ లో క్రీడాకారుడిని అభినంధించారు. అనంతరం ఖర్చుల నిమిత్తం 10,000 రూపాయల ఆర్థిక సహాయం చేసారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్ రాఘవేందర్ రెడ్డి, మరియు ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీల హామీని నెరవేర్చుతాం

### కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం

**పినపాక, విశాల భారతి:** పినపాక మండలం, పినపాక గ్రామంలోని రైతు వేదికలో తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ ఏర్పాటు చేసిన నీరు పేద కుటుంబాలకు,చెందిన ఆడపడుచులకు మంజూరైన కల్యాణలక్ష్మి 38 చెక్కులను ముఖ్య అతిధిగా పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ఆడపడచులకు కానుకగా పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిక 6 గ్యారంటీ పథకాలలో భాగమైన మహిళల ఉచిత బస్ ప్రయాణం, ఐదు లక్షలున్న ఆరోగ్య శ్రీ, కార్డును 10 లక్షలు వరకు పెంచారని అన్నారు.
అలాగే త్వరలో కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలతో పాటు తులం బంగారం కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే 100 రోజుల్లో 500 కి గ్యాస్ సిలిండర్,5లక్షలు పెట్టి ఇందిరమ్మ ఇల్లు, ప్రతి మహిళకు ప్రతినెల 2500, చేయూత కింద 4000 పెన్షన్, చదువుకునే విద్యార్థులకు విద్య భరోసా కార్డు కూడా అందజేయడం జరుగుతుంది అని ఆయన పేర్కొన్నారు. అలాగే గత ప్రభుత్వంలో ఇసుక దందాలు అక్రమ దందాలు భూకబ్జాలు చేసిన ఎవరిని వదిలేది లేదు అన్నారు. ప్రజలు దోపిడి ముఠా అరాచకాలతో ప్రజలు అవస్థలు పడ్డారు. క్యాంప్ ఆఫీస్ ను సెటిల్ మెంట్ అడ్డాగా మార్చారనీ సామాన్యుడి భాద చెప్పుకునే వేదికగా ప్రజా భవన్ తీర్చిదిద్దుతాననీ అన్నారు. దొంగలను, దోపిడీదారులను పార్టీ గేటు దాటనివ్వను గెలిపించిన ప్రజలను, పార్టీ కార్యకర్తలను, నాయకులను గుండెల్లో పెట్టుకుంటాకొని చూసుకుంటాను అని వారు అన్నారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం వుంటుందనీ తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





# జనసేనను బలోపేతం చేద్దాం

### పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ వెల్తూరి నగేష్*

**తొర్రూరు, విశాల భారతి:** జనసేన పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి వెల్తూరి నగేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని ముఖ్య నాయకులతో స్థానిక విశ్రాంతి భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో రాబోయే రోజుల్లో సర్పంచి ,ఎంపీటీసీ మరియు ఎంపీ ఎన్నికలలో మన పాలకుర్తి నియోజకవర్గం లోని ఆరు మండలాల పరిధిలో ఉన్న గ్రామాలలో పవన్ స్టార్ పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని బలోపేతం చేయడం కోసం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు కలిసికట్టుగా అందరూ కలిసి ముందుకు రావాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# విశ్రాంత ఉద్యోగుల సేవలు భవిష్యత్ తరాలకు ఆదర్శం

### పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి

**తొర్రూరు, విశాల భారతి:** పాలకుర్తి నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఇట్టే సోమిరెడ్డి ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే కార్యక్రమం స్థానిక లైన్స్ క్లబ్ ఆవరణలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సేవలు భవిష్యత్ తరాలకు ఆదర్శమని, వారన్నారు. "నిన్నటి తరం నేటి తరానికి ఆదర్శం నేటి తరం రేపటి తరానికి మార్గదర్శమని" వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. విశ్రాంత ఉద్యోగులు నిరంతరం ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రజల యొక్క కష్టసుఖాలను పంచుకోవాలని ఎప్పటికప్పుడు సమాజానికి ఒక దిక్సూచిగా సలహాలు సూచనలు నేటి తరానికి అందించాలని వారు సూచించారు. భవిష్యత్తులో విశ్రాంతి ఉద్యోగుల డిమాండ్లను సమస్యలను పరిష్కరించే దిశలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో పాలకుర్తి నియోజకవర్గం లో తన వంతు బాధ్యతను నిర్వహిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగు జిల్లా అధ్యక్షులు మైస నాగయ్య ప్రధాన కార్యదర్శి సోమయ్య జిల్లా నాయకులు ఏ టి ఓ నవీన్ కుమార్ పి ఎన్ బి మేనేజర్ మోహన్ బ్లూ చీఫ్ ఎండి రజాక్ విశ్రాంత ఉద్యోగులు మండల ప్రధాన కార్యదర్శి ఎండి యాకూబ్ కోశాధికారి విజయ్ మున్నూరు కోటయ్య ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బ్యాడ్మింటన్ లో సత్తా చాటాలి

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, విశాల భారతి:** బ్యాడ్మింటన్ సాధన చేస్తున్న క్రీడాకారులు ఎస్ జీఎఫ్ స్టేట్ మీట్ లో సత్తా చాటాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ ఎస్పీ క్యాంప్ లోని డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీకి చెందిన ఇండోర్ స్టేడియంలో మిర్యాలగూడ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన 67 ఎస్ జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్ 14 బాల, బాలికల బ్యాడ్మింటన్ టోర్నీ, సెలక్షన్ పోటీలను మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడారు. క్రీడాకారులు వ్యక్తిగత ప్రదర్శనతో నేషనల్ టోర్నీకి ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీ నాయక్,బ్యాడ్మింటన్ జిల్లా అధ్యక్షులు వాసు దేవ్ రావు , కోచ్ మారబోయిన రామకృష్ణ ఉన్నారు.

# జర్నలిస్టుని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ

**చిట్యాల, విశాలభారతి:** పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు మిర్యాల ప్రకాష్ మాతృమూర్తి మిర్యాల వజ్రమ్మ ఇటీవల మృతిచెందగా సోమవారం మాజీ ఎమ్మెల్సీ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చేరుపల్లి సీతారాములు ప్రకాష్ ని పరామర్శించి కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పేదరికాన్ని ఎదుర్కొంటూ భర్త మరణించిన తరువాత ఆరుగురు పిల్లలతో కుటుంబాన్ని ఒక గాడిలోకి తీసుకువచ్చిన తీరును ఈ సందర్భంగా ఆయన నెమరు వేసుకున్నారు. ఆయన వెంట సీపీఎం జిల్లా నాయకులు జిట్టా నగేష్ తదితరులు ఉన్నారు.



# కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 56వ వర్ధంతి

**నారాయణఖేడ్, విశాల భారతి:** నారాయణఖేడ్ లోని సంఘం వద్ద ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు.. స్వాతంత్ర సమర యోధుడు.. ప్రముఖ రచయిత.. జర్నలిస్ట్.. హైదరాబాద్ మొదటి మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 56వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ ముదిరాజ్, ఆల్కరి సత్య నారాయణ, అవిటి శంకర్ ముదిరాజ్, పూటలా విట్టల్ ముదిరాజ్, నేతి రాంచందర్ ముదిరాజ్, సంఘం నాయకులు పాల్గొన్నారు





# క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

### ఎస్ జీఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి

**తొర్రూరు,విశాల భారతి:** క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఓ. జ్యోతి తెలిపారు. పట్టణంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో అండర్14, 17, 19 విభాగాల రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి పది జిల్లాల నుంచి 600 క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఎస్జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి, రాష్ట్ర పరిశీలకులు అంతటి శంకరయ్య, జిల్లా క్రీడా కన్వీనర్ చెడుపల్లి ఐలయ్యలు తొలి రోజు బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రింగ్ లోకి దిగిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి జ్యోతి మాట్లాడుతూ. ధైర్యం ఉన్నవారే బాక్సింగ్ లో రాణిస్తారని , ఈ ఆటకు నిరంతర సాధన అవసరమని తెలిపారు. విద్యతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు.పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని కోరారు. రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు క్రీడా ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు. క్రీడా ధ్రువపత్రాలు ఎంతో విలువైనవని, ఉన్నత విద్య నభ్యసించేందుకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల నిమిత్తం ప్రభుత్వం 2 శాతం క్రీడా కోటా వర్తింప చేస్తుందని తెలిపారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక పరిశీలకులు పార్థసారథి, వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్ , విజయ్ చందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.



# పశుమిత్రలకు వేతనాలు నిర్ణయించాలి

**తొర్రూర్ ,విశాల భారతి:** పశుమిత్రలకు కనీస వేతనాలు అందించాలని పశుమిత్ర వర్కర్స్ యూనియన్ జనగామ జిల్లా అధ్యక్షులు నజియా బేగం, జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగరి మంగలు అన్నారు. పశు మిత్రల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు అనుబంధ పశుమిత్ర వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. పశు మిత్రల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నజియా బేగం, మంగ లు మాట్లాడుతూ. గత ప్రభుత్వం మహిళా, పొదుపు సంఘాల్లో చురుకైన మహిళలను గుర్తించి శిక్షణ అందించి పశుమిత్రలుగా నియమించారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులు, గొర్రెలు, గేదెలు, మూగ జీవాలకు అనేక రకాల వైద్య సేవలు అందించేందుకు పశు మిత్రలను వినియోగించుకుందని తెలిపారు.8 ఏళ్లుగా వేతనం లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులు గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లకు, కుక్కలకు కృత్రిమ గర్భధారణ, వ్యాక్సిన్, టీకాలు వేయడం, శస్త్ర చికిత్సలు, గాలి కుంటు వ్యాధి, నీలి నాలిక వ్యాధి, పోచమ్మ వ్యాధి, దొబ్బి వ్యాధి తదితర జబ్బులకు మందులు వేస్తూ రైతులకు ప్రభుత్వానికి వారధిగా ఉన్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఆఫీసు బేరర్ కొత్త రజిని, ప్రతినిధులు శ్రావణి, సరళ, మంజుల, స్వప్న, అనిత , స్వప్న, రాజేశ్వరి , సంధ్య, అనిత, సంధ్యారాణి, రజితలు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన ప్రకాష్

**నారాయణఖేడ్, విశాల భారతి:** నారాయణఖేడ్ నియోజకవర్గానికి నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైనా సందర్భంగా పి.సంజీవ్ రెడ్డిని పోలీస్ కోచింగ్ సెంటర్ డైరక్టర్, మోటివేషన్ స్పీకర్ బి.ప్రకాష్ శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటి రాజు , వారి బృందం సునీల్, రాజు, సుమంత్, ప్రవీణ్ కుమార్, ఉపేందర్ పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకలను సక్సెస్ చేయాలి

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, విశాలభారతి:** ప్రతి ఏటా ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసే క్రిస్మస్ వేడుకలను సక్సెస్ చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్డీవో ఆఫీస్ లో ఆర్డీవో ఆఫీస్ లో క్రిస్మస్ సెలబ్రేషన్స్ వేళ పాస్టర్స్ తో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 22న క్రిస్మస్ వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో చెన్నయ్య, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, జిల్లా నేతలు వేణుగోపాల్ రెడ్డి, గాయం ఉపేందర్ రెడ్డి ఉన్నారు.





# నర్సరీని పరిశీలించిన ఎంపిడిఓ

**భీమదేవరపల్లి, విశాల భారతి:** మండల వ్యాప్తంగా సుమారు రెండు లక్షల ఇరువైవేల మొక్కలు వివిధ గ్రామంలో నర్సరీలలో పెంచేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపిడిఓ భాస్కర్ తెలిపారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం ములుకనూరు గ్రామంలోని నర్సరీ, పల్లె పకృతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నర్సరీ ఏర్పాటు చేసి ఒక్కొక్క నర్సరీలో పదివేలకు తగ్గకుండా మొక్కలు పెంచడానికి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. మండలంలోని 22 గ్రామాల్లోని నర్సరీలలో వివిధ రకాల పండ్లు, పూల మొక్కలకు పెంపుకు మట్టి బ్యాగులు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముల్కనూర్ కార్యనిర్వహణాధికారి జంగం పూర్ణచందర్, ఏపీఓ కుమారస్వామి, క్షేత్ర సహాయకుడు వంగ కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు .

# అసత్య ఆరోపణలపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం

**మిర్యాలగూడ, విశాల భారతి:** పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ కేంద్రంగా ఫేక్ వజ్రాలను విక్రయించిన విషయమై గత కొన్ని నెలల క్రితం త్రిపురారం మండల పరిధికి చెందిన ఓ ఎంపీటీసీ భర్త పై స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు కాగా ..ఆ ఫేక్ వజ్రాల న్యూస్ పేపర్ క్లిప్ పై తన పేరును ఎడిట్ చేసి వాట్సప్ గ్రూప్ లో పోస్ట్ చేస్తూ తన పరువుకు భంగం కలిగిస్తున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యామని 6 వ వార్డు ఇందిరమ్మ కౌన్సిలర్ భర్త సాధినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ కాలనీని తన శక్తి మేరకు అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం ఉంటే నేరుగా సంప్రదించిన ఫోన్ చేసిన సానుకూలంగా స్పందిస్తామని అంతే కానీ..సంబంధం లేని కేసులను తనకు ఆపాదిస్తూ కుట్ర పూరిత చర్యలకు దిగితే లీగల్ గా ముందుకు వెళ్తామన్నారు. ఫేక్ వజ్రాల కేసు తన పేరును ఎడిట్ చేసిన చేస్తున్న అసత్య ప్రచారాలతో వార్డు ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని..అందుకే మీడియా ముందుకు వచ్చినట్లు చెప్పారు. ప్రజలెవరూ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.



# మాదక ద్రవ్యాలు వాడినా రవాణా చేసిన కఠిన చర్యలు

### సూర్యాపేట డిఎస్పీ నాగభూషణం

**సూర్యాపేట, విశాలభారతి:** మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వినియోగం పై కఠిన చర్యలు తీసుకొంటామని తీవ్రంగా హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ లో గంజాయి బాధితులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ నాగభూషణం మాట్లాడుతూ గంజాయి మరే ఇతర మాదక ద్రవ్యలు రవాణా చేసిన వినియోగించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అలాంటి వారి గురించి మాకు తగిన సమాచారం అందించాలని ఈ సందర్భంగా డిఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.





# ఘనంగా రుద్ర చండీ యాగం

**నారాయణఖేడ్, విశాల భారతి:** పురాతన కాశీనాథ్ మందిరం నందు శ్రీ లలిత దేవి ఉపాసకులు శివ పంతులు ఆధ్వర్యంలో మలమంచి గురురాజ శర్మ వైదిక నిర్వహణలో నవ చండీ పారాయణ పూర్వక రుద్ర చండీ హోమ కార్యక్రమం లోక కళ్యాణార్థం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ హనుమాన్లు సెట్, సాయి సంగమేశ్వర్, శ్రీనివాస్, విజయ్, పరమేశ్వర్, అశోక్ పాల్గొన్నారు.



# సాంస్కృతిక కార్యక్రమాల పేరిట స్వాహా

- నిధుల దుర్వినియోగం, అవినీతిపై విచారణ జరగాలి
- నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు కార్యాచరణ

**సూర్యాపేట, విశాలభారతి:** సూర్యాపేట పబ్లిక్ క్లబ్ నందు జరుగుతున్న అవినీతి, అవకతవకలపై సూర్యాపేట ఆర్డీవో విచారణ జరపాలని పబ్లిక్ క్లబ్ సీనియర్ సభ్యులు,సీనియర్ న్యాయవాది నూకల సుదర్శన్ రెడ్డి ,మాజి కార్యదర్శి బొల్లెద్దు దశరథ అన్నారు.మంగళవారం క్లబ్ ఆవరణలో జరిగిన సభ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ పబ్లిక్ క్లబ్ సెక్రటరీగా కొప్పుల వేణారెడ్డి పనిచేసిన సమయంలో దుకాణ సముదాయం నిర్మాణం చేయడం వలన, జిమ్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా ఆదాయం పెరిగిందని, ప్రస్తుతం క్లబ్ ఆదాయం లక్షలలో వున్నదని అన్నారు. ప్రస్తుత సెక్రటరీ క్లబ్ యొక్క ఆధాయ వ్యయాలను కమిటీ సభ్యులకు తెలియజేయడం లేదని, సెక్రటరీ ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తూ, సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో లక్షలాది రూపాయల అవినీతి కి పాల్పడినారని వారు అన్నారు. 12 నెలలకు ఒకసారి జనరల్ బాడి మీటింగ్ పెట్టవలసి వున్నప్పటికీ, సమావేశం నిర్వహించడం లేదని అన్నారు. పబ్లిక్ క్లబ్ ఫంక్షన్ హాల్ కాంట్రాక్టర్ రెండు సంవత్సరాల పాటు చెల్లించవలసిన అద్దె చెల్లించలేదని, అద్దె వసూలు చేస్తామని కార్యదర్శి చెప్పినప్పటికీ వసూలు చేయలేదని అన్నారు. కావున క్లబ్ లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై క్లబ్ చైర్మన్ సూర్యాపేట ఆర్డీవో విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పబ్లిక్ క్లబ్ సభ్యులు ఎల్గూరి చంటి బాబు,శనగాని రాంబాబు గౌడ్,కుమ్మరికుంట్ల లింగయ్య, గవ్వా కేశవరెడ్డి,రావుల రాంబాబు నాయుడు,అంజద్ అలి,షేక్ సైదులు,రుద్రంగి రవి,నాగుల వాసు,రావుల రాంబాబు, యలగందుల సాయినేత,గుణగంటి సైదులు,కుందామల్ల శేఖర్,ఎల్గూరి వెంకటేశం,రాపర్తి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు భరోసా కల్పించాలి

- ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి
- ఫిర్యాదుల నిర్వహణ పై జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఫీడ్ బ్యాక్ సేకరణ
- రాహుల్ హెగ్డే ఎస్పి సూర్యాపేట జిల్లా



**సూర్యాపేట, విశాలభారతి:** పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు, ఫిర్యాదుదారులకు భరోసా, నమ్మకాన్ని కల్పించడం పోలీసు ప్రాథమిక విధి అని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపీఎస్ అన్నారు. మంగళవారం పోలీస్ రిసెప్షన్ సెంటర్స్, పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టం నిర్వహణపై సెట్ కాన్ఫిరెన్స్ ద్వారా పోలీసు అధికారులకు సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు సలహాలను అందించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల, పిర్యాదుదారుల పట్ల గౌరవంగా ఉండాలని, పోలీసు శాఖ ప్రతిష్ట పెరిగేలా పని చేయాలని తెలిపినారు. సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకోవద్దు అని ఆదేశించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని రిసెప్షన్ సెంటర్ల నందు మౌలిక వసతులను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి ఫిర్యాదు పై వేగంగా స్పందించి ప్రాథమిక విచారణను వేగంగా నిర్వహించాలని తద్వారా బాధితులకు ఫిర్యాదుదారులకు భరోసా నమ్మకాన్ని కల్పించాలని, ప్రతి ఫిర్యాదు అంతర్జాలంలో నమోదు చేయాలి, ప్రతి పిర్యాదులు రసీదు ఇచ్చి పోలీసు పనితీరు పట్ల పారదర్శకతను చూపాలని తెలిపారు. పిటిషన్ మేనేజ్మెంట్ నిర్వహణ రిసెప్షన్ సెంటర్ నిర్వహణ కు సంబంధించి జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ఫీడ్ బ్యాక్ సేకరిస్తున్నాం అని అన్నారు. బాధితుల యొక్క సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి సత్వర పరిష్కారం చూపడానికి గాను ప్రతి సోమవారం మధ్యాహ్నం 2:30 గంటల వరకు జిల్లా పోలీస్ కార్యాలయం నందు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపీఎస్ గారు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఫిర్యాదుల నిర్వహణ కొరకు సెంట్రల్ కంప్లైంట్ సెల్ సమర్థవంతంగా పనిచేస్తుందని, గత వారం రోజులుగా సెంట్రల్ కంప్లైంట్ సెల్ ద్వారా జిల్లా పోలీస్ కార్యాలయం నందు 28 ఫిర్యాదులు పరిశీలించడం జరిగిందని అన్నారు. ప్రజలు సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని చట్ట ఉల్లంఘన చర్యలకు పాల్పడి భౌతిక దాడులు చేసుకోవద్దు. ప్రజలు సివిల్ తగాదాలు, భూమి సంభందిత సమస్యలను చట్ట ప్రకారం కోర్టుల పర్యవేక్షణలో పరిష్కరించుకోవాలని కోరారు.



# నివాళులర్పించిన మాజీ మంత్రి

**సూర్యాపేట, విశాలభారతి:** ఎల్కారం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ మొరిశెట్టి లక్ష్యాధి తండ్రి మొరిశెట్టి రాజయ్య అనారోగ్యం తో మృతి చెందారు. కాగా రాజయ్య పార్థివదేహానికి మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించినారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపినారు. ఆయన వెంట రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి తో పాటు పలువురు ఉన్నారు.



# ఎర్రజెండా ఎగరవేయాలి

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి.**

**మహబూబాబాద్ ,విశాల భారతి:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 98వ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న వాడవాడలో ఎర్రజెండాలు ఎగరవేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కురవి మండల కేంద్రం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మండల పార్టీ కార్యవర్గ సమావేశం బుడమ వెంకన్న అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా భారతదేశంలో కార్మికుల హక్కుల పరిష్కారానికై, పేద బడుగు, బలహీన వర్గాల హక్కుల రక్షణ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ, శాస్త్రీయ సిద్ధాంత నిబద్ధతతో విలువలు కలిగిన పార్టీగా అధికారంతో నిమిత్తం లేకుండా ప్రజల శ్రేయస్సేదేయంగా సమరశీల పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనని అన్నారు. పార్టీ చరిత్రను, ఔన్నత్యాన్ని, మార్క్సిస్ట్ సిద్ధాంత గొప్పతనాన్ని, పార్టీ పోరాటాల ఫలితంగా సాధించిన విజయాలను డిసెంబర్ 26 పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రచారం నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో కురవి మండల కార్యదర్శి కరణం రాజన్న, సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, తురక రమేష్ దొంతు రామ్మూర్తి పాల్గొన్నారు.




# సమస్యలు పరిష్కరించాలి

**కొత్తపల్లి శివకుమార్ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి**

**సూర్యాపేట, విశాలభారతి:** మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రం లోని విక్రమ్ భవన్ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డులు అందుకున్న సూర్యాపేట మున్సిపాలిటీ నేడు ఎక్కడ చూసినా చెత్తాచెదారంతోటి మురికి వాసన తోటి దుర్భరమైన పరిస్థితులలో ఉన్నదని విమర్శించారు. మునిసిపాలిటీ విలీన గ్రామాల్లో రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ అతి దారుణంగా తయారై ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, పిల్లలమర్రి, కాసింపేట, ఇందిరమ్మ కాలనీ అదేవిధంగా సూర్యపేట చుట్టూ ఉన్న గ్రామాల పరిస్థితి అతి దారుణంగా ఉన్నదని ,ఎక్కడైనా ఎవరైనా కమిషనర్ దృష్టికి తెస్తే వెంటనే ఆ సమస్యను పరిష్కరిస్తానంటాడు కానీ ఎన్ని రోజులైనా ఆ సమస్య అలాగే ఉంటుందని అన్నారు. పట్టణంలో దోమల మందు కొట్టక డ్రైనేజీ సరిగా తీయక దోమల బెడదతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, మునిసిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి మునిసిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి ఎర్ర అఖిల్, పార్టీ జిల్లా నాయకులు పేర్ల నాగన్న,యల్ ఏచ్ పియస్ జిల్లా కార్యదర్శి నాగేందర్. పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, ఉపాధ్యక్షురాలు సురం రేణుక, కోశాధికారి జయమ్మ, నరసన్న పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

**భద్రాచలం టౌన్ సిఐ నాగరాజు రెడ్డి**



**భద్రాచలం, విశాల భారతి:** శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ సిఐ నాగరాజు రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరి ఇంటి వద్ద వారే ప్రశాంతమైన వాతావరణంలోనే పుట్టిన రోజు వేడుకలు చేసుకోవాలని ఆయన సూచించారు. ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో వచ్చే తప్పుడు ప్రచారాలపై స్పందించరాదన్నారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోరాదని స్పష్టం చేశారు. ఏదైనా అసాంఘిక కార్యకలాపాలు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా అర్ధరాత్రి సమయంలో కేక్ కటింగ్ చేసి, బైక్ ర్యాలీ లు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. అంతేగాకుండా పుట్టిన రోజు వేడుకల పేరుతో రాత్రి సమయంలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలను ప్రమాదకరం గా నడిపి, ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దనీ పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని ఆయన అన్నారు.

# జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఆదివాసులకు ఇవ్వాలి

**బిఎస్పీ జిల్లా అధ్యక్షులు ఇర్పా రవికుమార్ డిమాండ్**




**భద్రాచలం, విశాల భారతి:** జిల్లా పరిషత్ చైర్మన్ పదవి గిరిజనేతరులకు ఇవ్వటాన్ని జిల్లా అధ్యక్షులు తీవ్రంగా ఖండించారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎస్టీలకు కేటాయించాలని, ప్రస్తుత జరిగిన నియామకాన్ని. రద్దు చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఇర్పా రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం జనాభా ప్రాతిపదికన జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎస్టి కి రిజర్వుడ్ చేయబడిందనీ ఎస్ టి కి రిజర్వుడు చేయబడిన జిల్లా పరిషత్ చైర్మన్ పదవి జనరల్ కేటగిరీకి చెందిన వైఎస్ చైర్మన్ గా ఉన్న కంచర్ల చంద్రశేఖర రావు కి ఇచ్చారని ఇలా ఎస్టీకి రిజర్వేషన్ చేయబడిన పదవిని గిరిజనేతలకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు పంచాయతీ రాజ్ చట్టం 2018కి పూర్తిగా విరుద్ధమని ఆదివాసుల హక్కులను హరించటమే అవుతుందని, వెంటనే చైర్మన్ పదవి నుండి కంచర్ల చంద్రశేఖర్ రావు ను తొలగించి పదవిని వేరొక ఆదివాసితో భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ చైర్మన్ పదవి ఆదివాసీలతోనే భర్తీ చేయాలని మొన్న కొత్తగా ఎన్నికైన నాలుగు నియోజకవర్గాల ఆదివాసి ఎమ్మెల్యేలు కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంతో చర్చించి వెంటనే ఆదివాసిని జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించాలని అన్నారు.



# నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం

**ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే**

నకిరేకల్, విశాలభారతి: నియోజక వర్గ అభివృద్ధే తన లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం తాళ్లవెల్లంల, వెంబావి గ్రామ నాయకుల ఆత్మీయ సమ్మేళనం హయత్ నగర్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విచ్చేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి శ్రీశైలం ఎమ్మెల్యేకి పుష్ప బుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కష్టపడ్డవారిని కంటికిరెప్పలా కాపాడుకుంటానని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదల జీవితాలు మారుతాయన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తానని గత పాలకుల నిర్లక్ష్యంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోకుండా వెనుకపడ్డాయన్నారు. రాబోయే రోజులో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందు ఉంచుతానన్నారు. వడ్డేపల్లి శ్రీశైలం మాట్లాడుతూ ఎమ్మెల్యే వీరేశం ఆధ్వర్యంలో నకిరేకల్ నియోజకవర్గం గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పున్న కైలాష్ నేత, ఎంపీటీసీ వడ్డేపల్లి లక్ష్మీపతి సర్పంచ్ అద్దెల నర్సిరెడ్డి,అద్దెల లింగారెడ్డి, తన్నీరు బిక్షం, తన్నీరు చంద్రమౌళి, తదితర నాయకులు పాల్గొన్నారు.



# జాతీయ క్రీడలకు కొంక ప్రణతి

**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని జైకేసారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి కొంక ప్రణతి ఈనెల 11, 12 తేదీల్లో మేడ్చల్ జిల్లా కేఎల్ఆర్ క్రికెట్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 14 బాలికల పోటీల్లో ఉమ్మడి నల్గొండ తరఫున ఎంపిక కావడం జరిగిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు అంబటి రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రణతినీ ఆ గ్రామ సర్పంచ్ కే సైదులు సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో రాణించాలని కోరారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# భూసేకరణ పనులని వేగవంతం చేయాలి

**అడిషనల్ కలెక్టర్**

**నల్లగొండ, విశాలభారతి:** ప్రాజెక్టులకి అవసరమైన భూసేకరణ, పనులని వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, భూసేకరణ అధికారులు, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిష్టరాయపల్లి, శివన్నగూడెం, గొట్టిముక్కల, పెండ్లిపాకల, ఉదయ సముద్రము, మొదలగు ప్రాజెక్టులలో జరుగుతున్న భూసేకరణ పనుల ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి పునరావాసం, రీ సెటిల్మెంట్ వెంటనే చేయాలని అధికారుల కి సూచించారు. ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్, మొదలగు పనులపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు రవి, దామోదర్, యస్ డి సి యూనిట్ 1 ఆఫీసర్ లీల, పిఎ టు స్పెషల్ కలెక్టర్ శ్రీదేవి, సూపరిండెంట్ లు హేమలత, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# యాచకులకు సహాయం



**మునగాల, విశాలభారతి:** మండల కేంద్రంలోని ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్, సూర్యాపేట జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ యూత్ కన్వీనర్ జెజె శామ్యూల్ సన్, తన భార్య ఉషలు కలిసి కోదాడ పట్టణంలోని వీధులలో తిరుగుతూ భిక్షాటన చేస్తున్న వారికి పేదలకు శామ్యూల్ పుట్టినరోజు సందర్భంగా దుప్పట్లు, మంచినీళ్ల బాటిల్స్ బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడంలో ఉండే ఆనందం మరేక్కడ దొరకదని అన్నారు. భవిష్యత్తులో పేదలైన వారికి ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందించేందుకు తన వంతుగా కృషి చేస్తానని వారు తెలిపారు. పుట్టినరోజు, వివాహ శుభకార్యాలు తదితర శుభకార్యలలో పేదలకు, యాచకులకు సహాయం చేయడంతో వారికి ఎంతో తోడ్పాటు అందిస్తుందని ఇలాంటి కార్యక్రమాలు చేసి వారిని ఆదుకోవాలని ఈ సందర్భంగా వివిధ శుభకార్యాలు చేసే వారిని కోరారు. ఈ కార్యక్రమంలో శామ్యూల్ ఉషలతో పాటు ఉదయ్, మనోహర్ పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్, సూర్యాపేట జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ యూత్ కన్వీనర్ జెజె శామ్యూల్ సన్, తన భార్య ఉషలు కలిసి కోదాడ పట్టణంలోని వీధులలో తిరుగుతూ భిక్షాటన చేస్తున్న వారికి పేదలకు శామ్యూల్ పుట్టినరోజు సందర్భంగా దుప్పట్లు, మంచినీళ్ల బాటిల్స్ బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడంలో ఉండే ఆనందం మరేక్కడ దొరకదని అన్నారు. భవిష్యత్తులో పేదలైన వారికి ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందించేందుకు తన వంతుగా కృషి చేస్తానని వారు తెలిపారు. కార్యక్రమంలో శామ్యూల్ ఉషలతో పాటు ఉదయ్, మనోహర్ పాల్గొన్నారు.



# హెచ్ ఎంకు ఘన సన్మానం

**చిట్యాల,విశాలభారతి:** చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామం జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ ఎం సి హెచ్ నర్సింగరావు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పి.ఆర్.టి.యు తెలంగాణ చిట్యాల మండల శాఖ తరపున ఘనంగా సన్మానించారు.హెచ్ ఎం మాట్లాడుతూ బదిలీ అనేది ఉద్యోగరీత్యా సాధారణమే అని ఇన్ని రోజు సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాక అధ్యక్షుడు బాదం బిక్షపతి,మండల అధ్యక్షులు రేబల్లి శరత్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దంతూరి సైదులు గౌడ్, కార్యవర్గ సభ్యులు అంజయ్య, కరుణాకర్ గౌడ్, జయంతి మాల తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ కు రాజీనామా



**మోతె,విశాల భారతి:** బిఆర్ఎస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలు నచ్చకఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బిఆర్ఎస్ పార్టీ రావి పహాడ్ గ్రామ శాఖ అధ్యక్షులు పొడపంగి ఎలమంచి అన్నారు. మంగళవారం రావి పహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్ని రోజులు తనకు అన్ని రకాలుగా సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. తన రాజీనామా లేఖను పార్టీ అధిష్టానానికి పంపినట్లు తెలిపారు. ఈరోజు నుంచి ఆ పార్టీకి నాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్యకర్తలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.



జీవో 317 బాధిత

# ఉపాధ్యాయులకు స్థానికత కల్పించాలి

**మంత్రులను కలిసిన బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులు.**

**ముషీరాబాద్,విశాలభారతి:** జీవో 317 వల్ల స్థానికత కోల్పోయిన ఉద్యోగ ఉపాధ్యాయులను తిరిగి వారి స్థానిక జిల్లాలకు కేటాయించాలని బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులు మంత్రులను కలిసి కోరారు. ఈ మేరకు ఉపాధ్యాయులు తమకు న్యాయం చేయాలని మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంను కలిసి కోరారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి, విజయ్ కుమార్, వినోద, చాముండేశ్వరి, విద్యానంద్, సందీప్ స్థానికత కోల్పోయి ఇబ్బంది పడుతున్న పరిస్థితిని వారికి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టిలో ఉందని త్వరలో జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ సమస్యను పరిష్కరిస్తారని ఉపాధ్యాయులు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# ఈడీ సమన్లు తక్షణమే ఉపసంహరించుకోవాలి

- కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న బీజేపీ..
- ఢిల్లీ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నాలు చేస్తే తట తీస్తాం..
- ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ హెచ్చరిక..




**ముషీరాబాద్,విశాల భారతి:** కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న బీజేపీ ఆదేశానుసారం ఈడి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు సమన్లు జారీచేసి 'సిగ్గులేని కుట్ర' కు పాల్పడుతుందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. అరవింద్ కేజ్రీవాల్ పై నకిలీ, బోగస్, చట్టంలో నిలకడలేని కేసులు పెట్టి ఢిల్లీ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నాలు చేస్తే తాట తీస్తామని అయన హెచ్చరించారు. ప్రధాని మోడీ మిడతల దాడికి బయపడేదిలేదని, నిజాయతీకి మారుపేరైన అరవింద్ కేజ్రీవాల్ కు దేశ ప్రజలు, ఆప్ శ్రేణులు అండగాఉంటారని అయన చెప్పారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు జారీ చేసిన ఈడి సమన్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ హైదరాబాద్, ట్యాంక్ బండ్, అంబెద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టింది. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ ఢిల్లీ పాలనా విధానం చూసి మోడీ భయం, ద్వేషం పెంచుకొని అరవింద్ కేజ్రీవాల్ పై ఈడి దాడులు చేయిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏ సంబంధంలేని అరవింద్ కేజ్రీవాల్ కు ఢిల్లీ లిక్కర్ స్కాంలో సాక్షిగా పిలిపించారా లేదా అనుమానితుడిగా పిలిపించారా అనే విషయంపై స్పష్టత లేదని, కేసుకు సంబంధించిన వివరాలను అందించడంలో ఈడి పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు పంపడం వెనుక "రాజకీయ కుట్ర" ఉందని, ప్రతిపక్ష నాయకులను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేస్తూ వేధింపులకు గురిచేస్తూ గొంతు నొక్కే ప్రయత్నం నిరంకుశ మోడీ ప్రభుత్వం చేస్తుందని అయన మండిపడ్డారు. చట్టవిరుద్ధం రాజకీయ ప్రేరేపితమైన సమన్లను ఈడి తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షం దేశవ్యాప్త ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, మొహమ్మద్ మజీద్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, మహిళా నేతలు మౌనిక, మంజుల, అధికార ప్రతినిధి విజయ్ పవర్, నేతలు టి. రాకేష్ సింగ్, శ్రీనివాస్ రెడ్డి, కొడంగల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులను వెంటనే నియమించాలి

**ఎన్ఎస్యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమాన్**

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం బెజ్జోర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని నిజామాబాద్ జిల్లా ఎన్ఎస్యుఐ ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమాన్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి స్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ రెహమాన్ మాట్లాడుతూ పాఠశాలలో గత మూడు నెలల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా గణితం, బయాలజీ సబ్జెక్టుకు చెందిన టీచర్లు బదిలీ కావడంతో ఇంతవరకు పాఠశాలలో ఎవరిని నియమించలేదని అన్నారు. దీంతో విద్యార్థులు బోధన పరంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకొని వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని విద్యాధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్ఎస్యుఐ అధ్యక్షుడు పవన్ రెడ్డి, ప్రనిత్, సాయి, లక్కీ ,నిహల్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో వ్యక్తిత్వ వికాస తరగతులు

**సైదాపూర్, విశాల భారతి:**
మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో వ్యక్తిత్వ వికాస తరగతులను ట్రైనర్ అనగొని రమేష్ గౌడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాస తరగతులు అంటే మీ ఆలోచనలు, దృక్కోణాలు, వైఖరితో సహా మీ ఖచ్చితమైన నైపుణ్యాలను పెంపొందించే కళ. వేల మంది గుంపులు, మనస్సుల మధ్య మిమ్మల్ని విభిన్నంగా కనిపించేలా చేసే ప్రవర్తన లక్షణం. మీ ఆలోచనలు, అవగాహనలలో మీకు పార్శ్వదర్శనాలను అందిస్తుంది. ప్రతి రకమైన పరిస్థితుల్లో ఉత్తమ నిర్ణయం తీసుకోవడానికి మిమ్మల్ని సిద్ధంగా ఉంచుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# అన్యాయం చెయ్యొద్దు

- నెగ్లెట్ కాబడిన కులాలను అభివృద్ధి చేయాలి.
- తెలంగాణ రాష్ట్ర బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి.
- రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక.

**ముషీరాబాద్,విశాల భారతి:** తొలగించిన కులాలను మళ్ళీ కలిపి మా కులాలకు అన్యాయం చేయొద్దని తెలంగాణ రాష్ట్ర బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి పేర్కొంది. ఉమ్మడి రాష్ట్రం తో పాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఏ గ్రూపులో ఉన్న కులాలు అత్యంత నెగ్లెట్ కాబడ్డాయని తెలిపింది. మళ్లీ బీసీ ఏ గ్రూపులో ఇతర కులాలను కలిపితే సంచార, యాచక కులాల తోపాటు ఇతర కులాలు అత్యంత వెనుకబడి పోయే ప్రమాదం పొంచి ఉందని గుర్తు చేసింది. ఈ మేరకు మంగళవారం కోటి లోని బీసీ సాధికారిక భవన్లో తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ భాగయ్య నేతృత్వంలో రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మానస గణేష్, ఎమ్మెస్ నరహరి, సుధాకర్, సంపత్ హాజరై మాట్లాడారు. తెలంగాణలో తొలగించిన ఆంధ్రకు చెందిన 27 కులాలను మళ్లీ బీసీ ఏ గ్రూపులో చేర్చాలని ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.ఇదే జరిగితే అత్యంత దారిద్ర రేఖకు దిగువకు ఉన్న కులాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే ఈ కులాలకు ప్రభుత్వ ఫలాలు అందని ద్రాక్ష లాగా మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని తమ కులాలను అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా ఎమ్మెస్ నరహరి, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల నరసింహులు, ట్రెజరర్ అంబటి సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి



**భద్రాచలం, విశాల భారతి:** భద్రాచలం అంబేద్కర్ సెంటర్ నుంచి చర్ల రోడ్డు రాజుపేట వరకు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని మహాజన సమితి ఆదివాసి మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి అన్నారు. ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ చర్ల రోడ్డు చివారు ప్రాంతం దాకా జన ఆవాస నివాసాలు ఉన్నందున ఎప్పుడు జనాలతో రద్దీగా ఉంటుందని ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్స్ లేక ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని ఆమె ఆవేదన చెందారు. అంతే కాకుండా అధిక స్పీడుతో లారీలు, టాక్టర్లు, ద్విచక్ర వాహనాలు అతివేగంతో రావడం వలన అనేక యాక్సిడెంట్లు అవుతున్నాయని దీనికి కారణం స్పీడ్ బ్రేకర్స్ లేకపోవటమేనని ఈ ప్రాంతంలో అనేక యాక్సిడెంట్లు జరుగుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైంది కాదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ పిల్లలు కాలేజీ పిల్లలు తరచు తిరిగే ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం అని ఆమె అన్నారు స్పీడ్ బ్రేకర్స్ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు.



# మంత్రిని కలిసిన చెర్వుగట్టు దేవస్థాన సిబ్బంది

**నార్కట్ పల్లి, విశాలభారతి:** నార్కట్పల్లి మండలం చెర్వుగట్టు శ్రీ శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవాలయం సిబ్బంది రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి శాలువాతో సత్కరించి రామలింగేశ్వర స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అన్ని విధాల తోడ్పాటు అందిస్తానని తెలిపారు. అనంతరం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి ఆలయ ఇబ్బంది శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎక్స్ అఫిషియో నెంబర్ శ్రీ రామలింగేశ్వర శర్మ, అధికారులు,ఆలయ సిబ్బంది కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేతగాని కృష్ణ, బత్తుల ఉషయ్యా గౌడ్, వడ్డే భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా ఉద్యమాల్లో తనదైన పాత్ర పోషించిన పోటు శ్రీనివాసరావు

**మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మల్లు నాగార్జున రెడ్డి**

**మునగాల, విశాల భారతి:** కమ్యూనిస్టు ఉద్యమంలో అంచలంచెలుగా ఎదిగి మిలటెంట్ కార్యకర్తగా ప్రజల మన్నలను పొంది ప్రజా ఉద్యమాల్లో తనదైన పాత్ర పోషించిన గొప్ప వ్యక్తి కామ్రేడ్ పోటు శ్రీనివాసరావు అని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై సోమవారం మృతి చెందిన పోటు శ్రీనివాసరావు భౌతిక గాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అంతిమయాత్రలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజా సమస్యలపై పనిచేయడంతో పాటు కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందు తీసుకోవడంలో ఆయన పాత్ర గొప్పది అన్నారు. కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యానికి గురైనప్పటికీ కమ్యూనిస్టు సిద్ధాంతం పట్ల ఎర్రజెండా పట్ల అసంచలమైన విశ్వాసం కలిగిన కామ్రేడ్ అని ఆయన కొనియాడారు. పోటు శ్రీనివాసరావు మృతి సిపిఎం పార్టీకి తీరనిలోటని వారన్నారు. వారి ఆశయా సాధన కోసం మనందరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమట్ల వెంకటేశ్వరరావు, నెమ్మది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దేవరం వెంకటరెడ్డి, మిట్టగడుపుల ముత్యాలు, వేల్పుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్తలారా ఇక ఊపిరి పీల్చుకోండి

- మీ పదేళ్ల కష్టం వృధాకాలేదు.
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.
- కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కాపాడుకుంటా.
- నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా.
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

**షాద్ నగర్ ,విశాలభారతి:** గత 10 సంవత్సరాలుగా కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నో వ్యయ ప్రయాసలను తట్టుకొని కూడా కాంగ్రెస్ జెండాను భుజానికి ఎత్తుకున్నారని,వారి కష్టం వృధా కాలేదని,తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చుకున్నామని,అలాగే తనను నమ్మి ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపించిన షాద్ నగర్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవకుడిలా పని చేస్తానని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత మొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని 19, 20, 21వ వార్డుల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పర్యటించారు. దీంతో ఆయనకు నాయకులు, కార్యకర్తలు బాణాసంచా పేల్చి ఘనస్వాగతం పలికారు.ఆయా వార్డుల్లో పర్యటిస్తూ తన గెలుపుకు కృషిచేసిన నాయకులు, కార్యకర్తలను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ గ్యారెంటీలను స్వాగతించి కాంగ్రెస్పార్టీకి పట్టం కట్టారన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన 6 గ్యారంటీ పథకలలో ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, నిరుపేదలకు రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ సేవలను అమలు చేశామని అన్నారు. మిగతా గ్యారెంటీలను త్వరలోనే అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన వివరించారు. నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించేందుకు అహర్నిశలు కృషి చేస్తానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా షాద్ నగర్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు వై.యాదయ్యయాదవ్,బస్వం అప్ప,జ మ్రుద్ ఖాన్,సుదర్శన్ గౌడ్,షఫీ ఖాన్, నీరటి వాసు, మన్నెరవి,నర్సింగ్ రాజ్,జగదీశ్వర్,రమేష్,అసద్ ఖాన్,రాజుల యాదయ్య,షర్ఫుద్దీన్,ప్రదీప్,లడ్డు, నక్క బాల్ రాజ్,మన్నె విజయ్,అశోక్,అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



# సీఎం నిర్ణయం హర్షణీయం

**ఓయూలో ర్యాలీ**

**సికింద్రాబాద్, విశాలభారతి:** డ్రగ్స్ పై ముఖ్యమంత్రి నిర్ణయం చారిత్రాత్మకం అనియువతకు భద్రత కానీ భరోసా కాంగ్రెస్ ప్రభుత్వం తోనే టి పి సి సి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ హైదరాబాద్ మహా నగరాన్ని డ్రగ్స్ రహిత నగరంగా మార్చుకుందాం అంటూ ఓయూ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్లు పరిశోధక విద్యార్థులు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్రికల్చరల్ యునివర్సిటీ ప్రొ. అల్దాస్ జానయ్య ,ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రో. చింత గణేష్, చరిత్ర విభాగం హెచ్ ఓ డి, డీన్ ప్రో. అర్జున్ రావు, చనగాని దయాకర్ లు మాట్లాడుతూ. డ్రగ్స్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలోని పెద్దలు డ్రగ్స్ పై వేసిన సిట్ విచారణను నీరు గారుచడం జరిగిందన్నారు. దశాబ్దాలుగా యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ ని నిషేధించడం చాలా మంచి పరిణామం అన్నారు. పబ్బులు క్లబ్బులపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి అని కోరారు. ఈ డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు యంత్రాంగానికి పూర్తి స్వేచ్ఛ కల్పించడం చాలా మంచి పరిణామంఅన్నారు.యూనివర్సిటీలలో,కళాశాలలో యాంటీ డ్రగ్స్ టీమ్స్ ఏర్పాటు చేసి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తయారు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ ఓయు ప్రెసిడెంట్ మెడ శ్రీనివాస్, సుమన్ గౌడ్, ఓయు జాక్ : రహీం,అంజిగౌడ్, AISF సత్య, పాల్గొన్నారు.



# వైభవంగా హనుమాన్ పునశ్చరణ కార్యక్రమం

**షాద్ నగర్ ,విశాలభారతి:** షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలపరిధిలోని భోధునంపల్లి గ్రామంలో మంగళవారం శ్రీ హనుమాన్ దేవాలయంలో హనుమాన్ పునశ్చరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని వందల సంవత్సరాల చరిత్ర కలిగిన పద్ధతి ఆంజనేయ స్వామి దేవాలయంలో పునశ్చరణ నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వేద పండితుల మధ్య హనుమాన్ విగ్రహానికి అభిషేకంతో పాటు హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుండి భారీ సంఖ్యలో మహిళలు,భక్తులు పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు పిప్పళ్ల జంగయ్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కళమ్మ వెంకటయ్య,ఉప సర్పంచ్ లావణ్య పాండు ,మాజీ సర్పంచ్ అంజయ్య,నాయకులు లింగారెడ్డి, పిప్పళ్ల శేఖర్,బీరప్పకోటేశ్వర్,నాగేష్, నరసింహ,కుమార్,రాధాకృష్ణ,రాజు, మహేష్,గణేష్ ఆంజనేయులు,లింగం,బాలరాజ్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్


# షాద్ నగర్ లో హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ 21/76 అమలు..!

- రాత్రి పది గంటల లోపు వైన్ షాపులు బంద్ కావాలి.!
- 11గంటల లోపు పాన్ షాపులు 12 గంటల లోపు బార్ అండ్ రెస్టారెంట్లు బంద్ చేసుకోవాలి.!
- 12 గంటల లోపు హైవే పై టీ స్టాల్స్ దాబాలు బంద్ చేసుకోవాలి.!
- షాద్ నగర్ పట్టణ సీఐ ప్రతాప లింగం.




**షాద్ నగర్,విశాలభారతి:** సైబరాబాద్ పరిధిలో ఇక హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ 21/76 అమలయిందని రాత్రి పది గంటల లోపు వైన్ షాపులు, 11 గంటల లోపు పాన్ షాప్ లు,12 గంటలకు బార్ అండ్ రెస్టారెంట్లు, దాబాలు, టీ స్టాల్స్ అన్ని బంద్ చేయాలని లేదంటే వీరిపై హైదరాబాద్ పోలీస్ ఆక్ట్ 21/76 నమోదు చేస్తామని నిబంధనలను ఉల్లంఘించిన వారిపై మొదటిసారిగా 25వేల రూపాయల ఫైన్ వేసి కోర్టులో హాజరు పరుస్తామని తర్వాత కూడా మళ్లీ రిపీట్ అయితే ఫైన్ పెంచుతూ చర్యలు తీసుకుంటామని షాద్ నగర్ పట్టణ సీఐ ప్రతాప లింగం తెలిపారు. నగర శివారులలో దొంగతనాలు ఘర్షణలకు పాల్పడేవారు టీ స్టాల్స్ దగ్గర టీ తాగుతూ సిగరెట్లు తాగుతూ దాబాల వద్ద రెస్టారెంట్ల వద్ద ఆహారాన్ని తింటూ దొంగతనాలకు ఘర్షణలకు పాల్పడుతున్నారన్న సమాచారంతో నూతన సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ఎక్కడైనా ఎవరైనా వైన్స్ కానీ దాబాలు, రెస్టారెంట్లు, టీ స్టాల్ లు బంద్ చెయ్యకపోతే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

# ఆ ఇద్దరికీ మంత్రి పదవులు!

- మంత్రుల కాకుండానే పార్లమెంట్ల బాధ్యతలు
- సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డికి బెర్తులు ఖాయమని చర్చ
- జహీరాబాద్, నిజామాబాద్‌ఇన్ చార్జిలుగా నియామకం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఎంపీగానూ కలిసొస్తుందని టాక్





**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. ఈ క్రమంలోనే రెండు ఎంపీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిల నియామకం కొత్త రాజకీయ చర్చకు దారి తీస్తోంది. రెండు ఎంపీ స్థానాలకు ఇద్దరు సీనియర్లను నియమించడంతో ఇప్పుడు వారి భవిష్యత్‌పై రకరకాల ప్రచారం జరుగుతోంది. 17 పార్లమెంట్ స్థానాల్లో 15 లోక్ సభ నియోజకవర్గాలకు మంత్రులకు మాత్రమే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ రెండు స్థానాల్లో మాత్రం ఓ ఎమ్మెల్యేకు, ఒక ఎమ్మెల్సీకి అప్పగించడం 'హస్తం' పార్టీలో హాట్‌టాఫిక్ గా మారింది.కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం నియమించిన పార్లమెంట్ ఇన్‌చార్జిల వ్యవహారం ఇప్పుడు పార్టీలో సంచలనంగా మారింది. తెలంగాణకు సంబంధించిన అన్ని పార్లమెంట్ నియోజకవర్గాలకు మంత్రులను ఇన్‌చార్జిలుగా నియమించగా, జహీరాబాద్, నిజామాబాద్ లోక్‌సభ స్థానాలకు మాత్రం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు, ఎమ్మెల్సీ జీనవ్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని నియమించడం ఇప్పుడు కొత్త టాక్‌కు తెరతీస్తోంది. వీరిద్దరూ కూడా కాంగ్రెస్ పార్టీలో సీనియర్లుగా ఉండడం, మాజీ మంత్రులు కావడం ఈ చర్చకు దారి తీసింది.

బోధన్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి గెలిచిన సుదర్శన్ రెడ్డి మొదటి నుంచీ మంత్రి పదవి రేసులో ఉన్నారు. తాను గెలిస్తే మంత్రి పదవి పక్కా అనే ధీమాతో ఉన్నారు. కానీ పార్టీ మాత్రం వెయిటింగ్ లిస్ట్ లో పెట్టింది. ఇప్పుడు సడెన్‌గా మంత్రులను నియమించిన పార్లమెంట్ సెగ్మెంట్‌కు ఇన్‌చార్జి సుదర్శన్ రెడ్డిని నియమించడంతో కొత్త కేబినెట్ లో బెర్త్ పక్కా అయినట్లే అనే ప్రచారం జరుగుతోంది. ఇక అటు జీవన్ రెడ్డి కూడా జగిత్యాల నుంచి ఓడిపోయినప్పటికీ ఇప్పటికే ఎమ్మెల్సీగా ఉండడంతో మంత్రి పదవి పక్కా అనుకున్నారు. కానీ ఇప్పుడు తన నియోజకవర్గం కూడా ఉన్న నిజామాబాద్ పార్లమెంట్‌కు అతన్ని ఇన్‌చార్జిగా నియమించడంతో జీవన్ రెడ్డికి కేబినెట్ బెర్త్ పక్కా అయిందనే ప్రచారం జరుగుతోంది.

**జీవన్ రెడ్డి లోక్‌సభ.. కేబినెట్ కా..?**

ఇక గత కొద్ది రోజులుగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పార్లమెంట్‌కు పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. నిజామాబాద్ నుంచి కాంగ్రెస్ లో బలమైన లీడర్లు ఎవరు లేకపోవడంతో జీవన్ రెడ్డిని పార్లమెంట్ బరిలో దింపుతారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా అదే పార్లమెంట్ స్థానానికి జీవన్ రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించడంతో ఆ చర్చ ఇప్పుడు ఈ సైట్ టర్న్‌తీసుకుంది. జీవన్ రెడ్డిని పార్లమెంట్‌కు పోటీ చేయిస్తే , అన్ని నియోజవర్గాల్లో పట్టు సాధించవచ్చనే టాక్ వినిపిస్తోంది. దీంతో లోక్ సభ ఎన్నికల్లో టఫ్ ఫైట్ ఇవ్వడం, గెలవడం ఈజీ అవుతుందనే భావనలో కాంగ్రెస్ పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఇప్పుడు పార్లమెంట్ ఇన్‌చార్జి ఇచ్చారనే ప్రచారం బలంగా జరుగుతోంది. ఇక ఉమ్మడి జిల్లాతో పాటుగా రెండు పార్లమెంట్ సెగ్మెంట్లలో ఆ ఇద్దరి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిని కాంగ్రెస్‌హైకమాండ్‌ఏ సీట్లలో కూర్చో బెడుతుందో చూడాలి.



# రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి వున్నాం

- మహిళ సంక్షేమానికి పెద్దపీట.
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్.

**షాద్ నగర్ విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని,అలాగే మహిళ సంక్షేమానికి పెద్దపీట వేస్తామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ అన్నారు.మంగళవారం షాద్ నగర్ లో జరిగిన కార్యక్రమంలో షాదీ ముబారక్,కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలలో ఇప్పటికే రెండింటిని అమలు చేసామని, మిగతావి కూడా త్వరలోనే అమలు చేస్తామని ఆయన గుర్తు చేశారు.తమ ఓటుతో కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వాసం ప్రకటించారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయక ప్రజారంజక పాలన అందిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ విశాల శ్రావణ్ రెడ్డి,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గిరియాదవ్,యూత్ కాంగ్రెస్ భాస్కర్ గౌడ్,యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమగళ్ల రమేష్, నాయకులు పల్లె ఆనంద్ కుమార్,కరుణాకర్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి,సురేష్ రెడ్డి,శ్రీనివాస్ యాదవ్,అనసూయమ్మ,గోపాల్ ముదిరాజ్,రావులపెంటయ్య,నరసింహ, శివయ్య,తహసీల్దార్ ఆజం అలీ,ఆర్ఐ నివేదిత,వివిధ గ్రామాల చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్పీకర్ గడ్డం ప్రసాద్ కు శుభాకాంక్షల వెల్లువ

**శుభాకాక్షలు తెలిపిన ఎఐఎవైఎస్ అధ్యక్షులు కర్క నాగరాజు**

**కూకట్ పల్లి,విశాలభారతి:** గ్రేటర్ హైదరాబాద్ అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంగం అధ్యక్షులు ( ఎఐఎవైఎస్ )కర్క నాగరాజు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం తొలి దళిత స్పీకర్ గా ఇటీవల ఎన్నికైన గడ్డం ప్రసాద్ కుమార్ ను మంగళవారం న్యూ ఏమ్మెల్యే క్వాటర్స్ లోని తన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి పూల భోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రేటర్ హైదరాబాద్ అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంగం నాయకులు కంది సాయికుమార్, జక్కుల అశోక్, శ్రీనివాస్, గుండె శివరాజు, సదామహేష్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.




# దర్గాలో మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి,విశాలభారతి:** కూకట్ పల్లి శాసన సభ్యులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తో కలిసి నియోజికవర్గ లోని కార్పొరేటర్లు పండాల సతీష్ గౌడ్, సీనియర్ నాయకులు మంగళవారం అజ్మీర్ షరీఫ్ దర్గాను సందర్శించి తమ మొక్కులను చెలించి అజ్మీర్ షరీఫ్ బాబా కు చాదర్నీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ గౌస్, బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింగ్ యాదవ్, కూకట్ పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యా నారాయణ, మూసపెట్ మాజీ కార్పొరేటర్ తుమ్ము శ్రవణ్, ఫిరోజ్ గూడ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, బేగంపేట్ శ్రీహరి పాల్గొన్నారు.

# చెత్త బుట్టలోకి 'గృహలక్ష్మి' దరఖాస్తులు

- గతంలో సేకరించిన అప్లికేషన్లు రద్దు చేసిన ప్రభుత్వం
- కొత్తగా గ్రామసభల్లో అప్లికేషన్లు తీసుకోవాలని నిర్ణయం




**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 15 లక్షల 'గృహ లక్ష్మి' దరఖాస్తులను రద్దు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం. గృహ నిర్మాణాల కోసం రూ .3 లక్షలు ఇచ్చేందుకు ఈ పథకాన్ని ఎన్నికల ముందు ప్రవేశ పెట్టింది..దీంతో ఈ పథకానికి దరఖాస్తుల వెల్లువెత్తాయి. తాజాగా గృహలక్ష్మి పథకం కోసం బీఆర్ఎస్ హయాం లో సేకరించిన 15లక్షల పైగా దరఖాస్తులను పరిగణించకూడదని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించింది. వాటి స్థానంలో కొత్తవి తీసుకోవాలని భావిస్తోంది. ఆ పథకానికి వచ్చిన మొత్తం పిటిషన్లలో 12 లక్షలు అర్హమైనవిగా అధికారులు గుర్తించారు. అయితే వాటన్నింటిని ఇప్పుడు చెత్తబుట్టలో వేయనున్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రామ సభలు నిర్వహించి అక్కడే దరఖాస్తులు స్వీకరించాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించింది.. త్వరలోనే గ్రామ సభల తేదీలను ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నది.




# మిచెల్ స్టార్క్ @ 24.75 కోట్లు

- ఐపీఎల్ చరిత్రలోనే భారీ రికార్డ్
- పాట్ కమిన్స్ 20.50 కోట్లు

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:** ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా ఆస్ట్రేలియాకు చెందిన మిచెల్ స్టార్క్ నిలిచాడు. కోల్ కతా నైట్ రైడర్స్ ఫ్రాంచైజీ ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ ను రికార్డు ధరకు కొనుగోలు చేసింది. గుజరాత్ టైటాన్స్, కేకేఆర్ స్టార్క్ కోసం పోటాపోటీగా వేలంలో పాల్గొన్నాయి. చివరికి మిచెల్ స్టార్క్ కోసం రూ.24.75 కోట్లు వెచ్చించి వేలంలో స్టార్ పేసర్ ను కళ్లు చెదిరే ధరకు కేకేఆర్ సొంతం చేసుకుంది. గతంలో రెండు సార్లు ఐపీఎల్ టైటిల్ కొట్టిన కేకేఆర్ మరోసారి టైటిల్ నెగ్గాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ క్రమంలో కేకేఆర్ ఫ్రాంచైజీ భారీ ధరకు ఆటగాళ్లకు సొంతం చేసుకుంది. మొదట ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ లాంటి పటిష్ట జట్లు ఆసీస్ పేర్ స్టార్క్ కోసం బిడ్డింగ్ మొదలుపెట్టాయి. ఓ మోస్తరు ధర వచ్చాక గుజరాత్ టైటాన్స్ రంగంలోకి దిగింది. క్రమంలో కేకేఆర్ వేలాన్ని మరింత ముందుకు తీసుకెళ్లింది. గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీతో పోటి పడి కేకేఆర్ ఐపీఎల్ చరిత్రలోనే రికార్డు ధరకు ఆసీస్ పేసర్ స్టార్క్ ను తీసుకుంది.

**గంటల్లోనే కమిన్స్ రికార్డు బద్దలు..**

ఐపీఎల్ 2024 మినీ వేలంలో ఆసీస్ ఆటగాళ్లకు భారీ ధర పలుకుతోంది. మినీ వేలంలో అత్యంత ఖరీదైన ఆటగాడుగా పాట్ కమిన్స్ నిలిచాడు. సన్ రైజర్స్ హైదరాబాద్ గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ మొత్తాన్ని పెట్టి కమిన్స్ ను కొనుగోలు చేసింది. ముందుగా చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఇతని కోసం పోటీ పడ్డాయి. మధ్యలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎంట్రీతో పూర్తిగా మారిపోయింది. 20.50 కోట్లకు సన్ రైజర్స్ కొనుగోలు చేసిన వెంటనే మిచెల్ స్టార్క్ రేసులోకి వచ్చాడు. రికార్డు స్థాయిలో రూ.24.75 కోట్లకు కోల్ కతా నైట్ రైడర్స్ పేసర్ ను సొంతం చేసుకుంది. ఐపీఎల్ చరిత్రలోనే ఇరవై కోట్ల ధర దాటడం ఇదే తొలిసారి. కాగా, ఇద్దరు ఆస్ట్రేలియా ఆటగాళ్లు ఇరవై కోట్లకు పైగా ధర పలికారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో ప్రజలు స్వేచ్ఛగా ఉన్నారు

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు అడ్వకేట్ యుగంధర్**



**విశాలభారతి,తుంగతుర్తి:**

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రజలు స్వేచ్ఛగా ఉన్నారని, తుంగతుర్తి నియోజకవర్గంలో నైతేగత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా బిఆర్ఎస్ మాజీ గాదరి కిషోర్ కుమార్ పాలనలో తుంగతుర్తి నియోజకవర్గం నిర్బంధానికి నిరంకుశత్వానికి గురైన తుంగతుర్తికి నేడు కాంగ్రెస్ ఎమ్మెల్యే స్థానిక బిడ్డ సౌమ్యుడు మందుల సామెలు గెలుపుతో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వచ్చినట్లైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు అడ్వకేట్ యుగంధర్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం యుగేందర్ మాట్లాడుతూ 2016 నుండి తుంగతుర్తి నియోజకవర్గంలో అక్రమ ఇసుక రవాణా నిలిపివేయాలని పోరాడుతున్న, ఆ పోరాటంలో ఎడి మైనింగ్ అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించి, కాంట్రాక్టర్లతో ప్రభుత్వానికి 7 లక్షల రూపాయలను ఫైన్ రూపంలో కట్టించిన అయిన కూడ ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ తీరు మార్చుకోకుండా అక్రమంగా ఇసుక రవాణా ఆపకుండా అడిగిన ప్రజల మీద తప్పుడు కేసులు పెడుతూ అవినీతిని అక్రమ ఇసుక రవాణా ఆపాలని పోరాడుతున్న యుగేందర్ పైన మాజీ ఎమ్మెల్యే వారి అనుచరులతో హత్యాయత్నం దాడులు చేయించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఏనాడు ప్రజల గురించి పట్టించుకోలేదని, తుంగతుర్తి ప్రజలు మేధావులు ఇసుక రవాణా నిలిపివేయాలని పోరాడుతునే ఉన్నారు. అలాంటి పరిస్థితిలో ఉన్న తుంగతుర్తికి నియోజకవర్గాన్ని కాపాడటానికి కాంగ్రెస్ పార్టీ నుండి స్థానికుడు, సౌమ్యుడు ఎమ్మెల్యే మందుల సామెలు ఇసుక రవాణా ఆపి భూగర్భ జలాలను కాపాడాలి, బిక్కేరు వాగును పరిరక్షించుకోవాలని మంగళవారం చేసిన ప్రజాపోరాటం , యావత్ తెలంగాణ సమాజానికి ఆదర్శమని, వారి పోరాటానికి తెలంగాణ ఉద్యమకారుడిగా స్థానిక బిడ్డగా కాంగ్రెస్ కార్యకర్తగా సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాని అడ్వకేట్ యుగంధర్ తెలిపారు. మంటికైన ఇంటివాడు కావాలనే నానుడి నిజం చేసిన నైజం మందుల సామెలుది అన్నారు. ఎన్నికల ప్రచారంలో స్వయాన వారే మాట్లాడుతూ తుంగతుర్తికి మందుల సామెలు ఎమ్మెల్యే అయితేనే ప్రజలు బాగుంటారని మాటిచ్చారని, నేడు అదే విధంగా ప్రజల మంచి కోసం పోరాడుతూ ఇచ్చిన మాటను నిలుపుకుంటున్న ఎమ్మెల్యేకు తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలు పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా వారిని కాపాడుకోవాలన్నారు.బిఆర్ ఎస్ తొమ్మిదిన్నర యేండ్ల అవినీతిని అంతమోద్దించి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ద్వారా అభివృద్ధి ఫలాలను అందించేందుకు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మద్దతుగా నిలువాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తెలంగాణ పౌరునికి ఉందని తెలంగాణలోని ప్రతి బిడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మద్దతుగా నిలువాలని కోరారు.

# టికెట్ ఎవరికిచ్చినా ఇబ్బందిలేదు

- జగనన్నకు ప్రాణమైనా ఇస్తా
- మంత్రి రోజా సంచలన వ్యాఖ్యలు



**విశాలభారతి,ఆంధ్రప్రదేశ్:** నగిరిలో ఎవరికి సీటు ఇచ్చినా తాను జగనన్నకు ప్రాణం ఇస్తానని మంత్రి రోజా అన్నారు. మంగళవారం ఉదయం శ్రీవారిని నైవేద్య విరామ సమయంలో ఏపి పర్యాటక శాఖా మంత్రి ఆర్.కే. రోజా స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. తనకు ఎమ్మెల్యే సీటు లేదు అనే ప్రచారం కేవలం శునకానందం మాత్రమే అని స్పష్టం చేశారు. ప్రతి రోజు నగరి నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంకు వెళ్తూ, సంక్షేమ పథకాలను అందిస్తూ పల్లె నిద్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకొని తక్షణమే వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె చెప్పారు.

**అన్ని కార్యక్రమాల్లోనూ ముందున్నా!**

క్యాబినెట్ సమావేశంమైనా, పార్టీ కార్యక్రమాలైనా ఎప్పుడూ నేను ముందు ఉంటానని తెలిపారు. టీడీపీ అనుకూల మీడియా దిగజారుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. టిక్కెట్ రాదని చెప్పి టీడీపీకి వైసీపీ అభ్యర్థులను మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. జగనన్నపై ప్రజల్లో ఎంత ప్రేమ ఉందో, అంతకు మూడింతలు పార్టీలో మా అందరికీ ప్రేమ ఉందని, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడానికి 100% అందరూ కలిసిమెలిసి పని చేస్తామన్నారు.. సర్వేల ద్వారా చర్చ జరిపి నిర్ణయం కూడా తీసుకున్నారని, ప్రజల వద్ద జగనన్నకు వ్యతిరేకత లేదని రోజా స్ప,ష్టం చేశారు




# దళిత ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించండి

- రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫారసులు అమలు చేయండి
- ఆల్ ఇండియా దళిత ముస్లిం ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు షేక్ ఇస్లాముద్దీన్
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

దళిత ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాంటూ ఆల్ ఇండియా దళిత ముస్లిం, ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలోని ఎఐఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా దళిత ముస్లిం ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు షేక్ ఇస్లాముద్దీన్, నేతలు షేక్ సత్తార్ సాహెబ్, మాదిగ జేఏసీ అధ్యక్షుడు పిడమర్తి రవి, ఖలీల్ అహ్మద్, అబ్దుల్ అహ్మద్, మీర్ ఫహద్ అలీ, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. 1950లో వెలువడిన రాష్ట్రపతి ఉత్తర్వులు, 1950 పారా3 ద్వారా దళిత ముస్లింలకు , క్రైస్తవులకు అప్పటి వరకు కొనసాగిన ఎస్సీ రిజర్వేషన్లను తొలగించారని చెప్పారు. ఆ తర్వాత 1956 లో దళిత సిక్కులకు, 1990లో దళిత బౌద్ధులకు తిరిగి కల్పించారని గుర్తు చేశారు. కానీ, దళిత ముస్లింల, దళిత క్రైస్తవులకు జస్టిస్ రాజేందర్ కమిటీ నివేదిక పేజీ 192, 193 నివేదిక, జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫారసులు 163, 164 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తీర్మానం 25082009 చేసిన కూడా ఆనాటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం తిరిగి ఈ రెండు వర్గాలకు తిరిగి కల్పిస్తామని వాగ్దానం చేసి 2014 వరకు కాలయాపన చేసిందని విమర్శించారు. ఇప్పుడు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా ఎస్సీ హోదా కల్పించలేదు. వెంటనే దళిత ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు.

# న్యూ ఇయర్ వేడుకలకు ఆంక్షలు

- అశ్లీల నృత్యాలకు నో పర్మిషన్
- శబ్దం 45 డెసిబుల్స్ దాటొద్దు
- ఒంటి గంటకు ముందే బార్లు, పబ్ లు క్లోజ్ చేయాలి




**విశాలభారతి,హైదరాబాద్:** న్యూ ఇయర్ వేడుకల పై హైదరాబాద్ పోలీసులు ఆంక్షలు విధించారు. రాత్రి ఒంటి గంటలోపే వేడుకలు ముగించాలని సూచించారు. ఈవెంట్ నిర్వాహకులు 10 రోజుల ముందుగానే అనుమతి తీసుకోవాలని, ప్రతి ఈవెంట్‌లోనూ సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. అశ్లీల నృత్యాలకు అనుమతి లేదన్న పోలీసులు.. వేడుకల్లో 45 డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దం రాకుండా చూసుకోవాలన్నారు. ఈ మేరకు న్యూయర్ మార్గదర్శకాలను జారీ చేశారు. ఒంటి గంటకు ముందే బార్లు, పబ్ లు క్లోజ్ చేయాలని ఆదేశించారు. "ప్రతి ఈవెంట్‌లో సెక్యూరిటీ తప్పనిసరి. సామర్థ్యానికి మించి పాసులు ఇవ్వొద్దు. పార్కింగ్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. సాధారణ పౌరులకు ట్రాఫిక్ సమస్య లేకుండా జాగ్రత్తపడాలి. మద్యం అనుమతించే ఈవెంట్‌స్‌లో మైనర్లకు అనుమతి లేదు. వేడుకల్లో డ్రగ్స్ వాడినా, వేడుకలకు అనుమతించిన సమయం ముగిసిన తర్వాత లిక్కర్ సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం" అని పోలీసులు స్పష్టం చేశారు.



# 20న ఈగల్ ట్రైలర్ విడుదల

మాస్ మహారాజా రవితేజ మోస్ట్ ఎవైటెడ్ యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం 2024లో విడుదలవుతున్న భారీ అంచనాలున్న సినిమాల్లో ఒకటి. టీజర్ విడుదలైన తర్వాత క్రేజ్ నెక్స్ట్ లెవల్ కి చేరుకుంది. ఇటివలే విడుదల చేసిన ఈగల్ ఊర మాస్ అంథమ్ ఆడు మచ్చా పాట చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఇప్పుడు మేకర్స్ ఈగల్ ట్రైలర్ అప్డేట్ ఇచ్చారు. ప్రేక్షకులు, అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈగల్ ట్రైలర్ డిసెంబర్ 20న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ట్రైలర్ రిలీజ్ డేట్ పోస్టర్ లో రవితేజ పెద్ద మిషన్ గన్ తో ఫైర్ చేసున్న టెర్రిఫిక్ లుక్ లో కట్టిపడేశారు. ఈ సినిమాలో రవితేజ మల్టిపుల్ షేడ్స్ ఉన్న పాత్రలో అలరించనున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తుండగా, కావ్య థాపర్ మరో కథానాయిక. నవదీప్, మధుబాల ఇతర ముఖ్య తారాగణం. కార్తీక్ ఘట్టమనేని ఎడిటింగ్ & దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి మణిబాబు కరణంతో పాటు దర్శకుడు స్వయంగా స్క్రీన్ ప్లే రాశారు. టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# ఆపరేషన్ వాలెంటైన్ ది ఫస్ట్ స్ట్రైక్ విడుదల

నిజమైన సంఘటనల నుండి ప్రేరణ పొంది తెలుగు, హిందీ భాషలలో చిత్రీకరించబడిన ఈ ద్విభాషా చిత్రం హై ఆక్టేన్ యాక్షన్ ఏరియల్ అడ్వంచర్ ని ప్రామిస్ చేస్తోంది సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్ గత సంవత్సరం విడుదలైన విజయవంతమైన చిత్రం 'మేజర్' తర్వాత మరొక దేశభక్తి అడ్రినలిన్ పంపింగ్ థ్రిల్లర్ 'ఆపరేషన్ వాలెంటైన్'తో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, మానుషి చిల్లర్ జంటగా నటించిన ఈ చిత్రం మోషన్ టీజర్ గత వారం విడుదలై ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ థ్రిల్ ని ఇచ్చింది. వారి ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ మేకర్స్ ఈ రోజు ఈ చిత్రం 'ది ఫస్ట్ స్ట్రైక్' టీజర్‌ను విడుదల చేశారు. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహించిన ఈ చిత్రం టీజర్ ప్రేక్షకులకు గూస్‌బంప్ ని ఇచ్చింది. 'ది ఫస్ట్ స్ట్రైక్' లో హీరో వరుణ్ తేజ్ కొన్ని పవర్ ఫుల్ డైలాగ్స్ తో పాటు అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. 'ఈ దేశం గాంధీజీ తో పాటు సుభాష్ చంద్రబోస్ ది కుడా' అని శత్రువులకు గుర్తు చేయడం మన దేశానికి ఎంత ముఖ్యమో తెలియజేస్తూ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. వందేమాత్రం నేపథ్య సంగీతం ప్రేక్షకులలో దేశభక్తిని రేకెత్తిస్తోంది. ఇది అతిపెద్ద వైమానిక దాడిని చూసేందుకు ఆసక్తిని కలిగిస్తుంది. ఈ సినిమా కథ మన వైమానిక దళ హీరోల ధైర్య సాహసాలు, దేశాన్ని రక్షించడంలో వారు ఎదుర్కొనే సవాళ్ల నేపథ్యంలో వుంటుంది. నిజమైన సంఘటనల నుండి ప్రేరణ పొందిన 'ఆపరేషన్ వాలెంటైన్' దేశభక్తి, ఎడ్జ్ ఆఫ్ ది సీట్ ఎంటర్‌టైనర్. ఇందులో అర్జున్ దేవ్‌గా వరుణ్ తేజ్, రాడార్ ఆఫీసర్ పాత్రలో మానుషి చిల్లార్ నటించారు. మానుషి తన పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయారు.





# కాజల్ ఇంకా కలల సుందరీనే ..

వెండితెరపై కథానాయికగా 20 ఏళ్ల పాటు రాజ్యమేలిన అందమైన భామలలో కాజల్ ఒకరు. 'లక్ష్మి కల్యాణం' సినిమాతో టాలీవుడ్ కి పరిచయమైన కాజల్, 'చందమామ' సినిమాతో, 'తెలుగు తెర చందమామ' అనిపించుకుంది. యూత్ లో క్రేజ్ తో పాటు, వరుసగా అవకాశాలను అందుకుంటూ వెళ్లింది. గట్టిపోటీ ఉన్నప్పటికీ స్టార్ స్టేటస్ ను అందుకోవడానికి ఆమెకి ఎక్కువ సమయం పట్టలేదు. తెలుగు .. తమిళ భాషల్లో ఏక కాలంలో స్టార్ హీరోల సినిమాలలో మెరుస్తూ, భారీ విజయాలను తమ ఖాతాలో వేసుకున్న కథానాయికల జాబితాలో కాజల్ కనిపిస్తుంది. అలాగే ఈ రెండు భాషల్లో చేస్తూనే, బాలీవుడ్ ను టచ్ చేసిన కథానాయికలలో కూడా ఆమె ఒకరిగా కనిపిస్తుంది. వివాహమై .. ఒక బిడ్డకు జన్మనిచ్చిన కాజల్, ఇప్పుడు సీనియర్ హీరోల సరసన బిజీ అయింది. కాజల్ లేటెస్ట్ పిక్స్ చూసిన వాళ్లంతా ఆమె గ్లామర్ మరింత పెరిగిందనే చెబుతున్నారు. గతంలో కంటే ఇప్పడే మరింత అందంగా కనిపిస్తోందని అంటున్నవారూ ఉన్నారు. హీరోయిన్స్ దొరక్క ఇబ్బంది పడుతున్న సీనియర్ హీరోలకు ఇక్కడి ఫస్ట్ ఆప్షన్ కాజల్ అనే అంటున్నారు. ఆమె కెరియర్ కి ఇప్పట్లో ధోకా లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# 'డెవిల్' నుంచి 'దూరమే తీరమై..' లిరికల్ సాంగ్ రిలీజ్

డిఫరెంట్ మూవీస్‌తో తనదైన గుర్తింపు సంపాదించుకున్న హీరో నందమూరి కళ్యాణ్ రామ్ లేటెస్ట్ మూవీ 'డెవిల్. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా దర్శక నిర్మాతగా ఈ సినిమాను రూపొందించారు. డిసెంబర్ 29న ప్రపంచ వ్యాప్తంగా సినిమా భారీ ఎత్తున విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇదొక పీరియడ్ డ్రామా. బ్రిటీష్‌వారు ఇండియాను పరిపాలించిన కాలానికి సంబంధించిన కథతో తెరకెక్కిన సినిమా కావటంతో నాటి పరిస్థితులను ఆవిష్కరించేలా భారీగా సినిమాను చిత్రీకరించారు. 'డెవిల్' సినిమా నుంచి విడుదలైన ట్రైలర్, పాటలు, టీజర్ సూపర్బ్ రెస్పాన్స్‌ని రాబట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం మేకర్స్ ఈ మూవీ నుంచి 'దూరమే తీరమై..' అనే లిరికల్ వీడియో సాంగ్‌ను రిలీజ్ చేశారు. సమీర భరద్వాజ్ ఈ పాటను రాసి పాడటం విశేషం. 'డెవిల్' చిత్రంలో ఎవరికీ అంతు చిక్కని ఓ రహస్యాన్ని ఆయన ఛేదించే బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా నందమూరి కళ్యాణ్ రామ్ ఆకట్టుకోబోతున్నారు. గత ఏడాది తెలుగు సినీ ఇండస్ట్రీలో వన్ ఆఫ్ బిగ్గెస్ట్ హిట్ మూవీగా నిలిచిన 'బింబిసార'తో మెప్పించిన కళ్యాణ్ రామ్ ఈ ఏడాది 'డెవిల్'తో మెప్పించటానికి రెడీ అవుతున్నారు.

# ట్రైలర్ కంటే 'హను మాన్' చిత్రం పదిరెట్లు అద్భుతంగా వుంటుంది

: ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో డైరెక్టర్ ప్రశాంత్ వర్మ



ఒరిజినల్ సూపర్ హీరో 'హనుమాన్' ట్రైలర్ కోసం ఎంతగానో ఎదురుచూస్తున్న రోజు రానేవచ్చింది. హీరో తేజ సజ్జ, దర్శకుడు ప్రశాంత్ వర్మ మాగ్నమ్ ఓపస్ 'హనుమాన్' థియేట్రికల్ ట్రైలర్ గ్రాండ్ గా లాంచ్ అయ్యింది. అఖండ భారతంలోని ఇతిహాసాల నుండి ప్రేరణ పొందిన ట్రైలర్ లోని మొదటి ఫ్రేమ్ మనల్ని ఫాంటసీ యూనివర్స్ అంజనాద్రి లోకి తీసుకువెళుతుంది. అండర్ వాటర్ సీక్వెన్స్ నేపథ్యంలో వచ్చే సన్నివేశంలో 'యథో ధర్మ తతో హనుమా... యథో హనుమ తతో జయ... (ధర్మం ఉన్నచోట హనుమంతుడు వుంటారు. హనుమంతుడు ఎక్కడ ఉంటాడో అక్కడ విజయం ఉంటుంది) అనే శ్లోకంతో నక్షత్రంలా మెరుస్తున్న ముత్యపు చిప్పకు దగ్గరగా కథానాయకుడు వెళుతున్నట్లు అద్భుతంగా ప్రజంట్ చేశారు. అంజనాద్రి నిజమైన అందం జలధార గల హనుమాన్ పర్వత శ్రేణిలో వుంది. అక్కడ భారీ హనుమాన్ విగ్రహం మహా అద్భుతంగా దర్శనమిచ్చింది. ఈ నేపథ్యంలో రఘునందన శ్లోకం గూస్‌బంప్స్ తెప్పించింది. కథానాయకుడు చిరుతతో పాటు పరిగెత్తడం, కొండను ఎత్తడం విలన్ ని కొట్టే యాక్షన్ దృశ్యాలు సూపర్ పవర్ తో అద్భుతంగా వున్నాయి. తర్వాత సైన్స్ సహాయంతో సూపర్ పవర్‌లను కనిపెట్టిన యాంటీహీరో వస్తాడు. తనని ప్రపంచంలో తిరుగులేని శక్తిగా చేసే పవర్ కోసం ఒక సైన్యాన్ని ఏర్పాటు చేస్తాడు. తన రాకతో ప్రతిదీ నాశనం చేస్తాడు, పిల్లలను కూడా విడిచిపెట్టడు. హీరోపై కూడా క్రూరంగా దాడి చేస్తారు. ధర్మాన్ని చీకటి కమ్మినపుడు, పూర్వీకులు మళ్లీ వస్తారు. చివరకు హనుమంతుని అద్భుత దర్శనం జరుగుతుంది. టీజర్‌లో హనుమంతుడు ఐస్ క్యూబ్‌లో శ్రీరాముడిని ప్రార్థిస్తున్నట్లు చూపించగా, దానిని పగలగొట్టి, ధర్మాన్ని రక్షించడానికి బయటకు వస్తారని ట్రైలర్ సూచిస్తోంది. నెక్స్ట్ లెవల్ ఎలిమెంట్స్ తోగూస్‌బంప్స్ తెప్పించింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ కృషి ప్రతి ఒక్క ఫ్రేమ్‌లో కనిపించింది. అద్భుతమైన యునివర్స్ ని సృష్టించి, పాత్రలతో పాటు మనల్ని ప్రయాణించేలా చేసి విజువల్ వండర్ గా తీర్చిదిద్దారు. సైన్స్ వర్సెస్ ఆధ్యాత్మికత అద్భుత కథచెప్పడంలో ప్రశాంత్ ప్రతిభ కనిపిస్తోంది. సూపర్ పవర్‌స్‌ని పొంది, ప్రపంచాన్ని రక్షించే అండర్‌డాగ్ పాత్రకు తేజ సజ్జా యాప్ట్ చాయిస్. ఆకట్టుకునే లుక్స్, స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్ తో తేజ సజ్జ ఆ పాత్రలో ఒదిగిపోయారు. వచ్చిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఆ పాత్రను నేర్పుగా పోషించారు. వినయ్ రాయ్ తన విలనీ యాక్షన్ తో భయపెట్టారు. సముద్రఖని సాధువుగా తన ప్రజెన్స్ ని చాటారు. తేజకు అక్కగా వరలక్ష్మి శరత్‌కుమార్ నటించారు. గెటప్ శ్రీను, వెన్నెల కిషోర్‌లు కూడా స్పేస్‌ని దక్కించుకున్నారు. హీరో తేజ సజ్జ మాట్లాడుతూ.. నిజాయితీగా కష్టపడి పని చేస్తే విజయం చేకూరుతుందని అంటారు. అందరినీ అలరించాలని ఈ సినిమా కోసం వందకి వందశాతం కంటే ఎక్కువ కష్టపడి పని చేశాను. నా ప్రయత్నం నేను చేశాను. విజయం వస్తుందనే ఆశిస్తున్నాను. మామూలు కుర్రాడికి దేవుని ఆశీస్సులతో సూపర్ పవర్స్ వస్తే వాడు చేసే అసాధారణ పనులు ఎమిటనేది ఈ సినిమా కథ. ఇప్పుడు నా పరిస్థితి కూడా అలానే వుంది. ఒక మామూలు కుర్రాడిని. హనుమాన్ అనే సినిమా సూపర్ పవర్ లా నా చేతిలో వుంది. ఇంక అసాధారణ పనులు చేయడమే బాకీ. అవన్నీ జరిగిపోతాయని భావిస్తున్నాను. దేవుని ఆశీస్సులు ప్రేక్షకుల ప్రేమతో ఖచ్చితంగా మేము మా లక్ష్యాన్ని చేరుకుంటాం. ఇంత గొప్ప సినిమా కోసం అహర్నిశలు కష్టపడుతూ సినిమా తప్పితే మరో ఆలోచన లేకుండా పని చేస్తున్న ప్రశాంత్ వర్మ గారికి థాంక్స్ చెప్పడం చాలా చిన్న మాట. నిర్మాత నిరంజన్ గారు చాలా పాజిటివ్ పర్సన్. సినిమా కోసం చాలా ఎఫర్ట్ పెట్టారు. ఈ పండక్కి హనుమాన్ వస్తుంది. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలన్న అసలు సిసలైన సంక్రాంతి సినిమా ఇది. ఫ్యామిలీ అంతా కలసి చూడదగ్గ సినిమా ఇది. పిల్లలకి హను మ్యాన్ పాత్ర చాలా నచ్చేస్తుంది. సంక్రాంతి అందరూ థియేటర్స్ కి రండి. హనుమాన్ మిమ్మల్ని చాలా గొప్పగా ఎంటర్ టైన్ చేస్తుంది'' అన్నారు. వరలక్ష్మీ శరత్ కుమార్ మాట్లాడుతూ.. ట్రైలర్ చూసిన తర్వాత గూస్ బంప్స్ ఇంకా తగ్గలేదు. అంత అద్భుతంగా వుంది. ఒక మార్వల్ సినిమా చూసిన అనుభూతి కలిగింది. ఈ సినిమాలో భాగం కావడం ఆనందంగా వుంది. హనుమాన్ మన మొదటి సూపర్ హీరో. ఆ ఎమోషన్ తో ఈ సినిమాని చేయడం నిజంగా అద్భుతం. తేజ చాలా చక్కగా నటించాడు. నిరంజన్ గారికి అభినందనలు. సినిమా అందరినీ అలరిస్తుంది'' అన్నారు.

# డంకీ డైరీస్‌ను ఆవిష్కరించిన చిత్ర యూనిట్



కింగ్ ఖాన్ షారూక్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ హిరానీ కాంబినేషన్‌లో రూపొందిన భారీ చిత్రం 'డంకీ'. డిసెంబర్ 21న ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ అవుతుంది. సమయం దగ్గరపడే కొద్దీ ఈ సినిమా రిలీజ్ ఎప్పుడెప్పుడు అవుతుందా..అని ఆసక్తిగా ఫ్యాన్స్, ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. అందరిలోనూ క్యూరియాసిటీ పెరిగిపోతుంది. షారూక్ సహా ఎంటైర్ టీమ్ 'డంకీ' ప్రమోషనల్ యాక్టివిటీస్‌లో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం షారూక్ గ్లోబల్ విలేజ్‌గా ప్రసిద్ధికెక్కిన దుబాయ్‌లో ఏర్పాటు చేసిన గ్రాండ్ ఈవెంట్‌లో ఈ చిత్రాన్ని ప్రమోట్ చేశారు. అందులో భాగంగా దుబాయ్‌లోని వోక్స్ సినిమాను సందర్శించారు షారూక్. ఈ కార్యక్రమంలో లక్షలాది మంది అభిమానులు పాల్గొనటం విశేషం. ఇప్పటికే 'డంకీ' సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్ పీక్స్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో మేకర్స్ అభిమానులకు మరో సర్‌ప్రైజ్‌నిస్తూ 'డంకీ డైరీస్'ను ఆవిష్కరించారు.

# అల్ట్రా స్టైలిష్ లుక్‌లో అనసూయ

టాలీవుడ్ క్రేజీ యాంకర్, నటి అనసూయ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. బుల్లితెరపై ఒక వెలుగు వెలిగిన అనసూయ ఇప్పుడు నటిగా విలక్షణ పాత్రలు చేస్తోంది. వెండితెరపై గ్లామర్ పాత్రలు చేయనప్పటికీ నటనతో అందరినీ మెప్పిస్తోంది. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన ఎన్నో విషయాలను షేర్ చేస్తూ ఉంటుంది. నెటిజన్లు ఎవ్వరైనా సరే డైలీ తన సోషల్ మీడియా వాల్ పై కన్నేయాల్సిందే అన్నట్లుగా ఫోజులు ఇస్తోంది. మోడ్రన్ అండ్ శారీ ఫొటో షూట్స్ షేర్ చేస్తూ కుర్రకారుకు మైకం తెప్పిస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన కొన్ని పిక్స్ వైరల్ గా మరాయి. పింక్ కలర్ మిడ్డీ, షార్ట్ టాప్ తో దిగిన కొత్త ఫొటోలను షేర్ చేసింది. స్టైలిష్ మోడ్రన్ డ్రెస్ లో అదిరిపోయే ఫోజులు ఇచ్చింది. నవ్వుతూ అందరినీ అట్రాక్ట్ చేస్తోంది. నిన్ను నువ్వు సంతోష పెట్టుకోవడమే గొప్ప వరం అంటూ మరోసారి తనలోని ఫీలింగ్స్ ను బయటపెట్టింది. దీంతో ఆమె పోస్ట్ కు లైకులు, కామెంట్లు భారీగా వచ్చిపడుతున్నాయి. ఈటీవీలో ప్రసారమవుతున్న జబర్దస్త్ వంటి కామెడీ షోలకు యాంకరింగ్ చేస్తూ మంచి గుర్తింపు సంపాదించుకుంది అనసూయ. అయితే సినిమా ఆఫర్స్ భారీ వస్తుండడంతో బుల్లితెరకు అనుహ్యంగా గుడ్ బై చెప్పేసింది. ఆ తర్వాత వరుస సినిమాలు చేయడం ప్రారంభించిది. అదే సమయంలో తన అందాలతో యువతను ఉక్కిరిబిక్కిరి చేసేందుకు సోషల్ మీడియాను ఎంచుకుంది. ఇన్‌స్టాగ్రామ్ లో అనసూయ ఇచ్చే ఫోజులు ఎలా ఉంటాయో స్పెషల్ గా చెప్పక్కర్లేదు. రంగస్థలం, పుష్ప, క్షణం లాంటి చిత్రాలు అనసూయకు నటిగా మంచి క్రేజ్ తీసుకువచ్చాయి. ఇటీవలే పెదకాపు-1లో అనసూయ అలరించింది. మంచి అంచనాల నడుమ వచ్చిన ఈ సినిమా ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. అలాగే ఆమె ప్రేమ విమానం అనే మరో మూవీలో నటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాలో తన నటన అద్భుతంగా ఉందని తెలంగాణ మాండలికం ఓన్ చేసుకుని చక్కగా నటించిందనే టాక్ వచ్చింది. ఇప్పుడు పుష్ప-2తోపాటు మరికొన్ని చిత్రాలతో బిజీగా ఉంది. అయితే వచ్చిన ప్రతీ ఆఫర్ కు అనసూయ ఓకే చెప్పి ఉంటే.. ఈపాటికి ఆమె సినిమాల లిస్ట్ పెద్దగానే ఉండాలి. కానీ ఆమె ఆచితూచి సెలక్ట్ చేసుకుంటోంది.



# వైరల్ గా మారిన 'కరీంనగర్స్ మోస్ట్ వాంటెడ్'



పొలిటికల్ క్రైమ్ డ్రామా వెబ్ సిరిస్ కరీంనగర్స్ మోస్ట్ వాంటెడ్ ఇప్పుడు టాక్ అఫ్ ది టౌన్ గా మారింది. స్ట్రీట్ బీట్జ్ సినిమా నిర్మాణంలో బాలాజీ భువనగిరి దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరిస్ డిసెంబర్ 22న ఆహా ఓటీటీలో విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సిరిస్ ట్రైలర్ మరియు కరీంనగర్స్ వాలే పాట సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. కరీంనగర్ లోని నలుగురు సామాన్య కుర్రాళ్ళ జీవితాలని ఆసక్తికరంగా పరిచయం చేస్తూ మొదలైన ట్రైలర్, యాక్షన్ డ్రామా ఎమోషన్స్ తో కట్టిపడేసింది. ట్రైలర్ లో అద్భుతమైన పెర్ఫార్మెన్స్ లు కనిపించాయి. నూతన నటులు అమన్ సూరేపల్లి, సాయి సూరేపల్లి ,అనిరుధ్ తుకుంట్ల ఇలా అంతా కొత్త నటులైనా, తమ సహజత్వంతో మంచి నటనని కనబరిచారు. దర్శకుడు బాలాజీ భువనగిరి కథనాన్ని గ్రిప్పింగ్ గా నడిపారు. ఈ సిరిస్ మొత్తం కరీంనగర్ లో షూట్ చేశారు. దీంతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని, విజువల్ గా చాలా ఫ్రెష్ నెస్ ని తీసుకొస్తుంది. ఇప్పటికే ఈ సిరిస్ నుంచి విడుదలైన "కరీంనగర్ వాలే" పాట చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఆస్కార్ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ పాడిన ఈ పాట కొత్త యూట్యూబ్ ఛానల్ విడుదల చేసినప్పటికీ వారంలో మిలియన్ వ్యూస్ ని క్రాస్ చేసి సూపర్ హిట్ అయ్యింది. అలాగే ట్రైలర్ కు కూడా ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది.